శ్రీ

కళ్యాణ కౌముది

శాంకరమీమాంసాసూత్రభాష్యమునకు

ఆంధ్రానువాదము

సభాష్యము

ప్రథమాధ్యాయము

ప్రథమ పాదము

ప్రథమసంపుటము

రచయిత:

రాయప్రోలు లింగన సోమయాజి

బి. ఏ., బి. ఎల్.

ఉపనిషచ్చన్ద్రిక రచయిత.

1955

దేవనాగరి పవర్ ప్రెస్,
గుంటూరు.

మూల్యం రు. 3-0-0

సాహిత్యాలంకారతర్కవేదాంతధర్మశాస్త్రవేత్తలును,
అవిచ్ఛిన్నాసప్తపౌరుషేయసోమపీథిసంప్రదాయ
నిర్వాహణులును, మదీయ పితృపాదులు నగు

వేంకటరమణశాస్త్రి సోమయాజిగారికిని

వారి ధర్మపత్నియు, మజ్జననియు నగు

రాజేశ్వరీ సోమిదేవిగారికిని

భక్తిపూర్వకముగ నీ యనువాదము
సమర్పితము.

విషయసూచిక

ప్రథమాధ్యాయము - ప్రథమపాదము

విషయము	పుట


అకారాది సూత్రపట్టికా.

ప్రథమాధ్యాయే ప్రథమపాదే



ప్రాతఃస్మరణీయనామధేయ భారతీసంప్రదాయ సార్వభౌమ

జగద్గురు శ్రీ కల్యాణానన్ద భారతీమహాన్తాచార్యస్వామిగురుపాదులు



గ్రన్థరచయిత

రాయప్రోలు లింగనసోమయాజి

బి. ఏ., బి. ఎల్.

బాదరాయణులు – బ్రహ్మసూత్రములు

ఈ గ్రంథము పేరు బ్రహ్మసూత్రము. గ్రంథకర్త బాదరాయణుడు. గ్రంథనామముగాని, గ్రంథకర్త నామముగాని యీ గ్రంథమున కనబడదు. మొదటి సూత్రములో 'బ్రహ్మజిజ్ఞాసా' అని అన్వర్థమగు నామము ఉండుట వలన దీనికి బ్రహ్మసూత్రము అని వాడుక కలిగియుండును. జైమిని మొదలగు సూత్రకర్తలును, శంకరుడు మొదలగు భాష్యకర్తలును బ్రహ్మసూత్రగ్రంథకర్త బాదరాయణు డని వక్కాణించిరి. ఈగ్రంథము తొమ్మిది ఘట్టములలో వేర్వేరు ఋషుల యభిప్రాయముల జెప్పి బాదరాయణుని పేర సిద్ధాంత మతమును జెప్పెను. ఇది ఆయన పరిపాటి కావలయు.

వ్యాసుడు – బాదరాయణుడు

వాయు విష్ణు మత్స్య స్కాందాది పురాణములు వ్యాస, బాదరాయణ, కృష్ణద్వైపాయనులను అభిన్నులనుగా వ్యవహరించును. కోశములు వ్యాస బాదరాయణ బాదరాయణి సత్యవతీసుత సత్యరత పారాశరి మాఠర* ద్వైపాయన పారా

---

* సాంఖ్యకారికా వృత్తికారు డగు మాఠరుడు వేరు. శాస్త్రకర్తలీ మాఠరుని దేవదత్తపదమువలె వాడిరి. — 'సర్వే బ్రాహ్మణా భుజ్యంతామ్; మాఠరకౌండిన్యౌ పరివేవిషాతామ్.'

శర్య కానీన కృష్ణద్వైపాయన సత్యభారత కృష్ణపదములు పర్యాయములని చెప్పెను. మరియు వాయు మత్స్య స్కాందాదులు వ్యాసులకు బ్రహ్మసూత్రకర్తృత్వముగూడ చెప్పెను. ఈ రీతిగా గ్రంథకర్తల సంప్రదాయమున వ్యాసులును బాదరాయణులును ఒక్కరే.

వ్యాసులు వేరా ?

బ్రహ్మసూత్రములు పెక్కు తావుల స్మృతుల నుదాహరించును. శారీరకమీమాంసాదులగు ఏ డెనిమిది భాష్యములు ఆస్మృతి సూత్రములకు భారతమునుండియు, గీతనుండియు ఉదాహరణములు చూపును. సూత్రకర్తయు, భారతకర్తయు ఒక్కడే యగుచో తనకు తానే ప్రమాణ మగునుగదా! విశేషించి బాదరాయణుడు వేదార్థనిర్ణయమున శ్రుతియే ప్రత్యక్షప్రమాణ మనును. ఇట్టి బాదరాయణుడు తా జేయు సిద్ధాంతమునకు తనమాట నే ప్రమాణముగా తీసికొను నని అభిజ్ఞుల ముందరకు రాగలడా ? ఇంతియకాక, శంకరుడు తన శారీరకమీమాంసాభాష్యమునం దొకచో-విష్ణ్వాదేశమున అపాంతరతము డను ముని కలిద్వాపరసంధిలో బాదరాయణుడుగా అవతరించెనని యనెను. మరియు — బ్రహ్మసూత్ర గ్రంథకర్తను గూర్చి చెప్పవలయు చోటుల 'ఆచార్యు డగు బాదరాయణు' డనియు, భారత గ్రంథ కర్తను గూర్చి చెప్పవలయుచోటుల 'వ్యాసుడు ఇటు లనియె' 'వేదవ్యాసు డిటు లనియె' ననియు వ్యవహరించును. కావున వ్యాసబాదరాయణు లిరువురును వేరని కొందరు తలతురు.

శారీరకమీమాంసాభాష్య వ్యాఖ్యాతలలో కొందరు వ్యాస బాదరాయణు లొకరే యని వ్రాసిరి.

పూర్వ మీమాంసాసూత్రమున జైమిని బాదరాయణుని, ఉత్తరమీమాంసాసూత్రమున బాదరాయణుడు జైమినిని ఉదాహరించిరి. కాగా జైమినియు బాదరాయణుడును సమకాలికు లనవలయును. లేదా ప్రకృత జైమిని బాదరాయణులకంటె భిన్నులును ప్రాచీనులును అగు మరియొక జైమినిని ఇరువురు బాదరాయణులనుగాని ఒక బాదరాయణుని ఇరువురు జైమినులనుగాని కల్పనచేయవలయును. అట్టి వారి గ్రంథములుగాని, అట్టివారుగాని ఉన్న ప్రసిద్ధి లేనందువలన ఈ కల్పన అసంగతమగుటచే ప్రకృత జైమిని బాదరాయణులే పూర్వోత్తర మీమాంసా సూత్రములే కాక మరి కొన్ని గ్రంథములు రచించియుందు రనియు అవి లుప్తములయియుండు ననియు ప్రకృతోదాహరణములు లుప్తగ్రంథములందలివి అయియుండుననియు కొందరూహింతురు. ఈ చిక్కులకు తోడు మరియొక చిక్కున్నది. భారతమున చెప్పబడిన జైమిని యొక డున్నాడు. అతడు వ్యాసశిష్యుడు. ఇతడు పూర్వ మీమాంసా కర్తయా? అగుచో బాదరాయణుడు తన శిష్యుని ప్రమాణీకరించునా? ఈ సందేహముల కన్నిటికి ఎవరికివారే సమాధానములు చెప్పుకొనుట లగ్గు.

వేద వ్యాసులు

వేదవ్యాసులకు వెనుక వేద మేస్థితిలో నుండెను?

వ్యాసులకు వేదవ్యాసు లనుమాట ఋగాది విభజన మాత్రము చేయుటవలన వచ్చెనా ప్రకరణాది సంగతముగా సంహిత పఱచినందువలన వచ్చెనా? వేదవ్యాసులును, బాదరాయణులును భిన్ను లగుచో బాదరాయణులకు వేదవ్యాసు లెంత వట్టు ఉపయోగించిరి? అది పురాణరూపమా, అన్యరూపమా? [illegible]లే వేదవ్యాసులు జైమినికి ఎంత ఉపయోగించిరి? బాదరాయణులు బ్రహ్మసూత్రములలో వేదార్థము నే వివరించిరి; కాన బాదరాయణులే వేదవ్యాసులై యుందురా? అగుచో జైమిని ఉదాహరించిన బాదరాయణుడును, వేదవ్యాసులును ఒకరా వేరా? ఎటులయినను జైమిని వేదవ్యాసుల నెంత వఱకు వేదార్థమునందుపయోగించుకొనెను? ఒకరే యగుచో పూర్వతంత్రకర్త యగు జైమిని వేదవ్యాసుల శిష్యుడా? పురాణ వ్యాసులును, వేదవ్యాసులును, బాదరాయణులును ఒకరా వేరా? పురాణములు మొత్తమువిూదను, సొంతముగను వేదాంతార్థమును అద్వైతముగ జెప్పునా, ద్వైతముగ జెప్పునా? వేదవ్యాసులను మాట యీ ప్రస్తావమున వినబడగనే యిట్టి ప్రశ్న లెన్నియో తలలో తలవెంట్రుకలవలె ఉప్పతిల్లును. వీనిని హేమా హేమీలకు ఘటాఘటీలకు విడిచి వేయుదును.

గ్రంథనామము, కాలము

ఈ గ్రంథమునకు చాల పేరులు ఉన్నటుల కనుగొందుము. పురాణములు బ్రహ్మసూత్రమనియు కొన్ని దర్శనములు వేదాంతదర్శనమనియు (విజ్ఞానభిక్షువు మాయావాద

మొకటే వేదాంతదర్శన మను పేరు గుత్తగొనెనా యని శక్యసపడెను) పాణిని భిక్షుసూత్ర మనియు, ఉపవర్షుడు ఉత్తర మీమాంసయనియు, శంకరాదులు శారీరకసూత్రము వేదాంతదర్శన మనియు రామానుజాదులు వ్యాససూత్ర మనియు అచట నచట వ్యవహరించిరి. దీని రచనాకాలమును ఊహించుటకు ఈ గ్రంథమునందు ఆధారము లెన్ని ఎక్కు డుగా దొరకునో సంశయములును వాని నెక్కుడుగా చుట్ట ముట్టును. ఇందలి 'స్మృతేశ్చ' (1-2-6) మొదలగు సూత్ర ములు 'ఏ స్మృతులను ప్రమాణముగా గ్రహించును' అని సందియము కలుగును. బాదరాయణునకు కొన్ని స్మృతులు అప్రమాణము లని 'స్మృత్యనవకాశప్రసంగాదితిచేత్ ...... (2-1-1) అను సూత్రమువలన మనకు తెలియును. ఏం తస్సూత్ర భాష్యకర్తలు పలుపురు అది కాపిలమనియే వ్రాసిరి. బాదరాయణుడు కపిలదర్శనమును బ్రతుకనీయ లేదని అందర కును తెలిసినదే. కావున స్మృతి యనగా బహు భాష్య కర్తల ఉద్దేశముచొప్పున సూత్రగ్రంథములును స్మృతులును పురాణములును భారతాదులును అని . అనుకొనవచ్చును. కాగా బ్రహ్మసూత్రము ఈ గ్రంథములకు ఈవలిది. మరియు బ్రహ్మసూత్రము సాంఖ్యాది మతములను ఖండించును. వీనిలో బౌద్ధ మిటీవలిద్ధి. గౌతమ బుద్ధుని పిదప ఆ మతమును నిలిపినవారిలో శ్రేష్ఠులు నాగార్జునుడు దిఙ్నాగుడు వసుబం ధుడు ధర్మకీర్తి మొదలగువారు. కాన వీరిపిమ్మట బ్రహ్మ సూత్రరచన యని కొంద రందురు.

ప్రాచీన బౌద్ధము

మహావీరునికంటెను, గౌతమబుద్ధునికంటెను పూర్వము బౌద్ధమతము కలదు. గౌతమబుద్ధునికి పూర్వము ఇరువది యిరువురు బుద్ధులు గతించినటులు బౌద్ధగ్రంథములు చెప్పను. మరియు ఇరువది నాలుగవ మైత్రేయబుద్ధు డవతరించగలడని జాతకకథలలో చదువుదుము. వ్యాససమకాలికుడు క్రకుచ్ఛందుడను నొకబుద్ధు డున్నటులు లంకావతారసూత్రాదు లందుగలదు. ఈ రీతిగనే ఋషభు డాదిగా ఇరువదిముగ్గురు తీర్థంకరుల పిదప మహావీరుడు. బ్రహ్మసూత్రములు, ఈ ప్రాచీన బౌద్ధజైనదర్శనములను ఖండించును. ఈ ప్రాచీన బౌద్ధమునకు మూలము శ్రుతి. ఉభయమీమాంసలకును వృత్తిరచించిన ఉపవర్షుని విజ్ఞానవాదఖండనమును శబరస్వామి 1-1-5 పూర్వమీమాంసాసూత్రమున అనువదించెను. ఆ ఖండనమునందు 'విజ్ఞానఘన ఏవ ఏతేభ్యో భూతేభ్యస్సముత్థాయ తాన్యేవానువినశ్యతి న ప్రేత్య సంజ్ఞాఽస్తి' అను బృహదారణ్యకబ్రాహ్మణము (6-5) క్షణిక విజ్ఞానవాదమునకు ఉద్భావకమని చెప్పెను. మరియు తత్త్వసంగ్రహమున శాంతరక్షితుడు (బౌద్ధుడు) ప్రాచీనబౌద్ధమునకు వేదమే ప్రమాణము అని వ్రాసెను. 'ఆకాశే చాఽవిశేషాత్' (2-2-24) అనుసూత్రమున శంకరులు ఉదాహరించిన 'సౌగతే హి సమయే పృథివీ భగవః కిం సన్నిశ్రియా?' అనుప్రశ్న ప్రతివచన ప్రవాహము ప్రాచీనుడగు సుగతునిది. ఈ ఘట్టము బుద్ధమతమును నిరాకరించును. ఆ సుగతుడు గౌతమబుద్ధుడే యగుచో తనమాటను

తాను ఖండించుకొనెనని అనవలెను. అదిచెల్లదు కదా. కాన ఇచట సుగతుడు ప్రాచీనుడు. కావున బుద్ధు లనేకు లనుటలో తప్పు లేదు. కావున బాదరాయణుడు నాగార్జునాదుల కంటెను, గౌతమబుద్ధుని కంటెను ఈవలివాడనుటకు వీలులేదని కొందరందురు.

బాదరాయణుడు తర్కపాదమున సాంఖ్యవైశేషిక సౌగతార్హత మహేశ్వర భాగవత మతములను ఖండించుటచే అతడు ఈమతాచార్యుల కంటె ఈవలివాడో లేక సమకాలికుడో యగుట తెల్లము. ఇది నిర్వివాదమయినను 'బాదరాయణుడు ఏబుద్ధునికంటె ప్రాచీనుడు' అను ప్రశ్న కలిగినటులు సాంఖ్యము నెడను కలుగును. ఇపు డుపలబ్ధమగు సాంఖ్యదర్శనము బ్రహ్మసూత్రములకు పదపటిదని కొందరందురు. ఎటులనగా సాంఖ్యమును పూరించెడు యోగదర్శనమున బౌద్ధస్ఫోట పరమాణు వాదముల ముచ్చటయే కలదు గాని అద్వైతపుమాట లేదు. ఇపు డుపలబ్ధమగు సాంఖ్యదర్శనమునందు బ్రహ్మసూత్రములను ఖండించిన గురుతులు విశదముగా కనబడును. కావున బాదరాయణుడు ఖండించిన కపిలాచార్యుడు కలిద్వాపరసంధి కాలమునకు చాలపూర్వుడు. మోక్షధర్మపర్వము చూచినచో కపిలుని ప్రాచీనత్వము స్పష్టముగా తెలియును. మరియు బ్రహ్మసూత్రములు యోగమును ఖండించెను. యోగదర్శనమున బాదరాయణ మత ఖండనము లేదు. కాన యోగదర్శనము బ్రహ్మసూత్రముల కంటె ప్రాచీనతరము. — ఇచటను ఒక గ్రంథి కలదు. యోగ

ప్రత్యక్త్యధికరణమున శంకరులు – 'అథ తత్త్వదర్శనోపాయో యోగః' అను నొక సూత్రము నుదాహరించిరి. అది పతంజలిది కాదు. ఇది మాహేశ్వరయోగసూత్ర మని చాణక్యుని అర్థశాస్త్రమున గలదు. మరియు,

'జాతుకర్ణో యదా వ్యాసో భవిష్యతి తపోధనః
తదాప్యహం భవిష్యామి సోమశర్మా ద్విజోత్తమః
అక్షపాదః కుమారశ్చ ఉలూకో వత్స ఏవచ.
తత్రాపి మమ తే శిష్యా భవిష్యంతి తపోధనాః'

అను నీ లింగపురాణశ్లోకమువలన గౌతముడు కణాదుడు వ్యాసుడు (బాదరాయణుడు) సమకాలికులనియు మరియు గౌతమునికి వ్యాసులు శిష్యులనియు తెలియుచున్నది. మరియు "వ్యాసులు గౌతమునికడ న్యాయముచదివి బ్రహ్మసూత్రములు రచించి అందుగౌతముని ఖండింపగా కినిసి గౌతముడు వ్యాసునితో ఇక నీమొగము చూడననెను. వ్యాసులు బతిమాలగా, గౌతముడు పాదములపై కన్నులు పెట్టుకొని చూచెను." అని ఒక కథ గలదు. మరియు న్యాయ వైశేషికదర్శనములందు బ్రహ్మసూత్రమతఖండనము కలదు. కావున గౌతముడును, బాదరాయణులును, కణాదుడును సమకాలికు లని కొందరందురు. నవ్యులిటులందురు – శతపథబ్రాహ్మణమునందలి ఆసురి కపిలశిష్యు డగునేని కపిలుడు క్రీ. పూ. ఆరవశతాబ్దివాడు. క్రీ. పూ. ఐదవశతాబ్దికో ఆరవశతాబ్దికో చెందినవాడు కణాదుడు. క్రీ. పూ. మూడవశతాబ్దికి చెందినవాడు గౌతముడు. శతపథబ్రాహ్మణమునందలి రహూగణుని కుమారుడితడు కావచ్చును. పతంజలి క్రీ. త. మూడు శతాబ్దులకును,

యోగభాష్యకర్త వ్యాసదేవుడు క్రీ. త. నాలుగుశతాబ్దములకును ఈవలి వాడుకాజాలడు.

పాణినికి పూర్వుడు

పాణినీయమున — 'పారాశర్యశిలాలిభ్యాం భిక్షునటసూత్రయోః' అనుసూత్రము కలదు. భిక్షుసూత్రమనగా బ్రహ్మసూత్రము. పారాశర్యుడనగా వ్యాసుడు. 'పారాశర్యుడనగా వ్యాసుడనియు భిక్షుసూత్రమనగా భిక్షుత్వము కలిగించు సూత్రమనియు అర్థమని శబ్దేందుశేఖరమున శ్రీ నాగేశభట్టు. భిక్షు పారాశరి పదములు సన్న్యాసివాచకములు. 'పారాశరిణో భిక్షవః' అని మహాభాష్యము (4-2-6). 'పారాశర్యునిచే చెప్పబడిన భిక్షుసూత్రమును అధ్యయనము చేయువారు' అను అర్థమున 'ణిని' ప్రత్యయము విధింపబడినది. ఆ భిక్షుసూత్రము పరాశరుని కొడుకగు వ్యాసునిచే విరచితమయినది, అని తెలియుచున్నది. కావున వ్యాసుడనినను, బాదరాయణుడనినను ఒకడే అనియు, అతడు పాణినికంటె ప్రాచీనుడనియు కొందరందురు.

పాణినికాల మింతవరకు అసందిగ్ధముగా తేలలేదు. కావున బ్రహ్మసూత్రకాలముగూడ తిన్నగా చెప్ప వీలులేదని కొందఱు తలతురు. ఇపుడు ఒకసారి వెనుదిరిగి చూచుచో బాదరాయణుని కాలమును, దర్శనకర్తల కాలమును మనకు మసక మసకగా కనిపించును.

పుట్టు పూర్వోత్తరములు

వేదము సంహితయనియు, బ్రాహ్మణమనియు, ఆరణ్యక

మనియు, ఉపనిషత్తనియు నాలుగు విధములుగానున్నది. సంహితా బ్రాహ్మణములు ధర్మమును అనగా కర్మమును ఆరణ్యకోపనిషత్తులు బ్రహ్మమును అనగా దైవమును చెప్పును. సంహిత లందును, బ్రాహ్మణములందును గల విరోధమును జైమిని తన పూర్వ మీమాంసాసూత్రములందు సమన్వయపరచెను. ఉపనిషత్తులందును, ఆరణ్యకములందును కొన్ని యెడల 'ఇదంతయు బ్రహ్మము' అనియు, 'ఇది యేదియు కానిది బ్రహ్మము' అనియు, 'జగజ్జన్మస్థితి లయములకు కారణము బ్రహ్మము' అనియు, 'జ్ఞానము బ్రహ్మము' అనియు 'బ్రహ్మము సర్వజ్ఞము' అనియు 'దేవుడేజీవుడ'నియు 'జీవుడు బ్రహ్మాంశము' అనియు, ఈ మొదలుగా పైకి కనబడు విరోధమును బాదరాయణుడు తన ఉత్తర మీమాంసా సూత్రములందు సమన్వయపరచెను.

బాదరాయణునకు చాల పూర్వమే 'దైవమెట్టిది, జగత్తునెవరు సృజించిరి' ఈ మొదలగు ప్రశ్నలును, వీనికి సమాధానములును వేదములందు కనబడుచున్నవి. బాదరాయణునకు పూర్వము ఆశ్మరథ్యుడు, ఔడులోమి, కాశకృత్స్నుడు అనువారు వేరు వేరు సిద్ధాంతములను చెప్పినటులు బ్రహ్మసూత్రములే చెప్పుచున్నవి. ఆరణ్యకములలోను, ఉపనిషత్తులలోను గల విషయములకు పైవారందరును వేరువేరు రీతులుగా అర్థము చెప్పిరి. ఇట్టి వేరు వేరు అభిప్రాయములలో శ్రుత్యభిప్రాయమేదియని నిర్ధారించుటకే ఈ బ్రహ్మ సూత్రములను బాదరాయణుడు రచించెను.

'యజ్ఞము చేయవలెను. దాన స్వర్గము లభించును' అని వేదము (కర్మకాండ) చెప్పును. స్వర్గము లభించునో లభింపదో అది యేరికిని ప్రత్యక్షానుమానాదులగు ప్రమాణములచేత తెలియునది కాదు. కావున 'స్వర్గప్రాప్తిలో వేదమే ప్రమాణముగాని తదితరములు కావు' అని పూర్వ మీమాంస చెప్పును.

'బ్రహ్మము నిర్గుణము' అని ఉపనిషత్తులు చెప్పును. 'సర్వవిశేష విరహితమగు బ్రహ్మవస్తువు అన్నిదృశ్యములకును, అన్ని అదృశ్యములకును మూల కారణమై యుండునని ఎవడును తెలియునది కాదు. కావున ఈ యెడల వేదమే ప్రమాణము గాని తదితరములు కావు' అని ఉత్తరమీమాంస చెప్పును.

ఇందొక విశేషముకలదు. ఈమీమాంసలో ఈశ్వరుడొకడే సర్వజ్ఞుడు. వేదము ఈశ్వరుని ఎరుకను తెలుపు మాటలపోగే. కర్మ భూతవస్తువుకాదుగాన దానికి వేదమొకటియే ప్రమాణము. బ్రహ్మము భూతవస్తువు. కాన భ్రాంతము. కాని ప్రత్యక్షప్రమాణముబోలె ఆ భూత వస్తువునకు లౌకికములగు ప్రత్యక్షానుమానానుభవాదులు సహకారి ప్రమాణములు కావచ్చును. చూ (1-1-2 శంకర భాష్య)

'కపిలో యది సర్వజ్ఞఃకణాదో నేతి కా ప్రమా ?
తావుభౌ యది సర్వజ్ఞౌ మతభేదః కథం భవేత్ ?'

అనగా 'కపిలుడుసర్వజ్ఞు డని యందు రేని; కణాదు డేలకాడు ? వా రిరువురును సర్వజ్ఞులందు రేని మతభేద మెటులు?' అని అందురు. కావున ఈశ్వరు డొకడే సర్వజ్ఞుడు. ఈ మహాభూతమునిశ్వసితమే వేదము. వేదవాక్యమే అభ్రాంతము. కావున, అలౌకికమగు విషయమునందు శ్రుతిని అనుసరింపనిదే ఏమియు తెలియక పోవుటేకాక సత్యము నెడ ఏకవాక్యతగాని, ఐకమత్యముగాని కలుగదు. ఇటు లెంచియే బాదరాయణుడు స్వముఖమున గాక వేదముఖమున నే బ్రహ్మోపదేశమును జేసియుండెను. కాగా ఉపనిషన్మతమే బ్రహ్మసూత్రమతము. బ్రహ్మసూత్ర ప్రథమాధ్యాయము నందు ఉపనిషద్వాక్యములకు సమన్వయప్రయత్నము కాన వచ్చును. దీనికి సమన్వయాధ్యాయ మని పేరు.

'శ్రుతిని అనగా ఉపనిషత్తుల ననుసరించి వ్రాయు సూత్రములమతము ఉపనిషన్మతమే యగునుగాని తదితరము కాదే! దానికొరక కింత వ్యాగ్యాయ మేల యనితోపవచ్చును. ఉపనిషన్మత మనగా ఉపనిషత్తులలో 'బ్రహ్మమెటుల చెప్ప బడినది' అను విచారము బ్రహ్మసూత్రములందు చేయబడెను. దానజేసియే దీనికి బ్రహ్మసూత్రమని పేరు. దీనిని ఉపనిషత్సూత్రమనిగాని, శ్రుతిసూత్రమునిగాని, వేదాంతసూత్రమనిగాని అననగునుగాని 'అథాతో బ్రహ్మజిజ్ఞాసా' అను తొలిసూత్రమే అటు లనవలదని తలయెత్తును. వేదాంతములందు చెప్పబడిన బ్రహ్మము ఈ గ్రంథమున మీమాంసింపబడునని అర్థము. దానజేసియే శంకరుడు ఆనందమయాధికరణమున 'ఆనంద

మ.యో ఽభ్యాసాత్ ' అను సూత్రమును వ్యాకరించుచో పైకితోచు అర్థమును ముందువ్రాసి అది శ్రుతికి సమీపముగా లేదని రెండవ అర్థమును వ్రాసెను. కొన్ని యెడల శంకర భాష్యము సూత్రాక్షరములకు అనుగుణముగా నున్నట్లు కనబడదు. బాదరాయణునిది శ్రౌతమతము గాక స్వమతమని ఒకటి ఉన్నచో శంకరులు సూత్రాక్షరములకు భిన్నముగా నున్నట్లు తోచు శ్రౌతతరమగు నర్థాంతరమునకు ప్రయత్నము చేయరు.

భాష్యముల్లు - వృత్తులు

ప్రాచీనులు గురువుతోడ వేదము నధ్యయనము చేసి నటులే సూత్ర వాఙ్మయమును గూడ నధ్యయనము చేసెడివారు. కావుననే నియమపూర్వక విద్యాభ్యాసవిషయమున తృతీయ. ఇది తెలుగుభాషయందును గలదు. బాదరాయణుడు తా జెప్పిన సూత్రములకు పూర్వమీమాంసాసూత్రములవలె ఉపక్రమోపసంహారాదిపూర్వకముగా తన శిష్యుల కర్థము చెప్పియుండును. 'అకృతవ్యూహాః పాణినీయాః' అను వ్యాకరణ పరిభాష యీ సంప్రదాయమునకు సాక్ష్యము. ఉపనిషదర్థమును నిర్ణయింపక బాదరాయణుడు తన శిష్యులకు పాఠము చెప్పియుండడు. బాదరాయణుడు ఉపనిషత్తులకు తన హృదయముననే భాష్యము వ్రాసికొని ఉపనిషద్వాక్యములకు స్ఫోరకమగు పదములను వాని అర్థమును, సూత్రములుగా రూపొందించియుండును. మరియు బాదరాయణుని సిద్ధాంతము ఎన్నియో సదస్సులందును, విద్వత్సమాజములందును

బ్రహ్మజ్ఞులందును, ఖండన మండనరూప సంస్కారము పొందక యుండదు. ఈ రీతిగా వేలంతలగు ఈసూత్రములు బంగారు కణికలాయెను. విద్యావంశము విరళమగు తరి, భాష్యములును, వృత్తులును ఉద్భవించును. దీనికిని అటులే జరిగెను.

ప్రాచీన భాష్యములు

శంకరులకు పూర్వము బ్రహ్మసూత్రములకు బోధాయనోపవర్ష భర్తృప్రపంచ బ్రహ్మనంది టంకాచార్య గుహదేవ భారుచి కపర్ది భర్తృహరి శుక గౌడపాద సుందర పాండ్య ద్రవిడాచార్య బ్రహ్మదత్తులను వారిలో కొందరు భాష్యములు కొందరు వృత్తులు మొదలగు వానిని వ్రాసినటులు కనబడును. శ్రీ గోపీనాథ కవిరాజు తన వేదాంత దర్శన భూమికలో పైవారి మతవాదాదికముల కొంతవట్టు తెలిపెను. శంకరునితో భేదించునవియు, ఇపుడు దొరకునవియు నగు భాష్యములు శంకరున కీతలివి. తమ ఆనుకూల్య ప్రాతికూల్యములకు శంకరభాష్యమే భాస్కర రామానుజాదులకు అవలంబముగా కనుపట్టును.

శంకరులు

శంకరాచార్యులవారిది మలబారు లోని కాలడి అను గ్రామము. "వీరి ఉదయము శశ్యగ్నిరసయుగ్మ పరిమితమగు యుధిష్ఠిర శకమున (౨౬౩౧) వైశాఖ శుక్ల పంచమినాడు. 'అస్తమయము అగ్నిరస యుగ్మ పరిమితమగు యుధిష్ఠిర శకమున (౨౬౬౩) కార్తికశుక్ల పూర్ణిమనాడు" అని కొంద

రందురు. 'క్రీ. శ 788 సంవత్సరమున జనించి 820 సంవత్సరమున స్వస్వరూపమును పొందిర'ని కొందరందురు.

వీరి బుద్ధివైభవమును తెలుపుట తలదాటినపని. కన్యాకుమారినుండి బదరికాశ్రమమువరకు ఆకాలమునందున్న మహానుభావులే దానికి సాక్షులు. పిదప భాస్కర రామానుజ పూర్ణప్రజ్ఞాదుల వంటి మహామహులు.

వారు నాలుగు దిక్కులందును నాలుగు మఠములను నెలకొలిపిరి. అచట అద్వైతాత్మవాదమును తెలుపగల శిష్యులను నిలిపిరి. నాటినుండి నేటివరకు అద్వైతవాద ప్రచారమవిరళముగ సాగిపోవుచున్నది. ఈ యద్వైతాత్మవాదమే మాయావాదమని ప్రసిద్ధము.

శంకరులు – భాష్యము

ఇపుడు మనకు శంకరుడు, భాస్కరుడు (భాస్కరాచార్యులుకాదు, భట్టభాస్కరుడు) రామానుజుడు, నింబార్కుడు, పూర్ణప్రజ్ఞుడు, శ్రీకంఠుడు, శ్రీకరుడు, శ్రీవల్లభుడు, విజ్ఞానభిక్షువు, బలదేవుడునను వారిభాష్యములు దొరకుచున్నవి. వీరలందఱిలో శంకరుడు ప్రాచీనుడు. భాస్కరుడు శంకరుల కేబదియో, నూఱో యేండ్ల కీవలివాడని కొందరందురు. కాని భాస్కరమతమును పద్మపాదులును, వాచస్పతి మిశ్రులును ఖండించిరి. 'అస్మత్ ప్రత్యయవిషయత్వాత్, అపరోక్షత్వాచ్చ ప్రత్యగాత్మప్రసిద్ధేః' అను అధ్యాసభాష్య వ్యాఖ్య చూ. శంకరుల భాష్యము ప్రౌఢము, మరియు పుష్పమువలె రమణీయము,

మృదులము. శబర భాష్యమునకును, దీనికిని పోలికకలదు. శంకరుల వాదకౌశలమునకును గౌడపాదుల అద్వైతప్రకరణ మునకును శైష్యోపాధ్యాయిక తప్పక స్ఫురించును. దీని శైలి గానముతో మిలితమైయుండును. వాఙ్మయమున కిదొక అపూర్వసంపద. ఇందు యుక్తులు, లోకవృత్తములు, అను భవములు సామెతలు, మిలమిల మెఱయుచుండును. శంకరులు తమ ప్రతిపక్షులను మృదువుగను, కఠినముగను గూడ మంద లింతురు. చూ. 1-3-19, బృహ-2-1. సిద్ధాంతము చెప్పుపట్ల శంకరుడు విన్నధికాక కన్నది చెప్పుచున్నట్టు లుండును.

వృత్తి కారుడు

వృత్తికారు డుపవర్షు డని వెనుక చూచియున్నాము. ఉపవర్షుడే బోధాయను డని కొందఱందురు. శ్రీమద్రా మానుజులు తమ శ్రీభాష్యమున "—'విస్తీర్ణాం బోధాయన వృత్తిం పూర్వాచార్యా స్సంచిక్షిపుః తన్మతానుసారేణ సూత్రాక్షరాణి వ్యాఖ్యాస్యంతే' పూర్వాచార్యులు విరివి యయిన బోధాయన వృత్తిని సంక్షేపించిరి. ఆమతము ననుస రించి సూత్రాక్షరములువ్యాకరింపబడుచున్నవి" అనివ్రాసిరి. దీని వల్ల బోధాయన వృత్తిని రామానుజులు చూచియుండ లేదని ఊహింపవచ్చును. రామానుజు లొకటి రెండుచోటుల వృత్తి కారవాక్యములనెత్తిరి. కాని వారికిముందే యామునాచార్యా దులు వానిని వృత్తికారవాక్యము లని చెప్పిరి. ఇక భాస్కరా చార్యులు ఒకేయొక ఉపవర్షవాక్యము నుదాహరించిరి.

భాస్కరుడుగాని రామానుజులు గాని ఉపవర్ష బోధాయను లొకరే యని చెప్పలేదు.

శంకరులు పలుతావుల వృత్తికృన్మతమును ఆదినుండి అంతమువరకు ఉపపాదించి ఖండించిరి. కొన్ని తావులలో దాని ననుగమించిరి. ఇటులగుటజేసి శంకరులు వృత్తిగ్రంథము నానుపూర్విగా నెరిగి యుందురని అనుకొనవచ్చును.

శంకరులు వృత్తికృన్మతమును వేఱొక పురాతన మతముచే ఖండింపలేదు. శంకరులకు పదపటివారగు భాస్కరుడును రామానుజులును సూత్రార్థమునందును, అధికరణవిభాగము నందును, పూర్వపక్షోత్తరపక్ష నిరూపణమునందును శంకరులతో భేదించిరి. భాస్కర రామానుజులు బోధాయనాదుల ననుసరించిరి; కాన బోధాయనాదులే యీభేదమునకు కారణమని తేలును. కాని ఇదియే నిక్కమగుచో శంకరుడే బోధాయనాదుల పేరుచెప్పి యేలఖండింపలేదు? అని తోచును. దీనివల్ల ఉపవర్ష బోధాయనులు వేరై యుందు రనియు, బోధాయన వృత్తిని శంకరు డెరుగ డనియు అన వలసి వచ్చును.

మరియు భాస్కర రామానుజులు శంకరుడు పూర్వపక్షముగా నుపపాదించిన మతవాదములనే సిద్ధాంత పక్షముగా చేసికొనిరి. అవి యన్నియు బోధాయనునకుగాని ఉపవర్షునకుగాని సమ్మతములని శంకర భాష్య వ్యాఖ్యాతలు చెప్పి యుండలేదు. కొన్ని ఖండనల పట్టున శంకర భాష్య వ్యాఖ్యాతలు 'ఇదివృత్తికార మతము' అని ఉల్లేఖించిరి. కొన్నిచోట్ల ఎవరి

పేరును చెప్పలేదు. కావున శంకరు లుపన్యసించిన మతవాదము లలో ఏవి బోధాయనాది పూర్వాచార్యులచే ప్రస్తావింప బడినవో, ఏవి సొంతముగనే ఉద్భావింపబడినవో (ఆక్షేప ప్రాస్తావిక సంబంధము) తెలియగల యవకాశము లేదు.

అద్వైతము

బ్రహ్మము అసంగము, అనంతము, అఖండము, నిర్విశేషము, అద్వైతమునగు వస్తువని శ్రుతి చెప్పును. మనకు దాని విశేషజ్ఞానము లేదు. ఇట్టి వస్తు వలౌకికము. లౌకిక విషయము లలో ప్రత్యక్షాది ప్రమాణములు ఉపయోగించును; కాని, అలౌకిక విషయములలో ఉపయోగింపవు. కావున, ఇట్టి వస్తువు నెడ శ్రుతికే ప్రామాణ్యము చెప్పవలెను.

వేదాంతోద్దేశము

అసంగము, అనంతము, అఖండము, నిర్విశేషము, అద్వైతము అని చెప్పబడిన బ్రహ్మము ఆత్మగా అనుభవ మగు శేజ్ఞానము. అది జ్ఞాతగను, జ్ఞానముగను, జ్ఞేయముగను చీలనిది. అదియే పరమార్థము. ధ్యానము చేయునపుడుగాని అమితమగు ఆనందము కలిగినపుడుగాని ఎప్పుడో ఒకానొకపుడు మన మందఱము దాని చవిచూచి యుందుము. గాఢ నిద్రలో అలవోకగనే మన మద్దానిలో మునిగిపోదుము. ఎరిగి యెరిగి అట్టి మెరుకలో నిచ్చలు నునికిగొను దారి చూపుటయే వేదాంతముల ఉద్దేశము.

ఆప్తవాక్యము

జ్ఞానులగు మహర్షుల అనుభవములే ఉపనిషత్తులు, లేక

వేదాంతములు. ఒకానొక ధీరుడు ప్రత్యగాత్మను చూచెను.♦ అని ఎవరో చూచినటులే కాక *'నే నీ మహాపురుషు నెరుగుదును' అని ఉపనిషత్తులు చెప్పెను.

మన తండ్రులు గాచనగరికి పోయివచ్చి 'ఆనగరమున రాజుగారి మేడ ఉన్నది. దానిలో చుక్కలే దీపములు. రాజు, చందమామయూ కాడు, సూర్యుడా కాడు, అతడు ఇటువంటి వా డటు వంటి వా డని చెప్ప లేము' అని చెప్పెదరు. బాలుర మగు మన మామాటలు విని ఆ నగరముగాని, ఆ రాజు గాని లేడని సందేహింపక ఎప్పుడు చూతుమా యని ఉవిళ్లూరుదుము. మనమా మేడను, ఆ రాజును కొంత కొంత ఊహించుకొందుము. కాని దానితో తృప్తిపడక పోయి చూచుటకే మిగుల ప్రయత్నింతుము.

ఈ యెడ మన తండ్రుల వాక్యములవలె ఈ ఋషుల వాక్యములు ఆప్త వాక్యములు. మన తండ్రుల వాక్యములు మనకు ప్రమాణములయ్యు స్వయముగా పోయి ఆ రాజును చూడనిదే తృప్తి కలుగ నటులు వేదవాక్యములు మనకు ప్రమాణమయినను ఆత్మసాక్షాత్కార మొందవక తృప్తి కలుగదు. దాన జేసియే శంకరులు — 'అనుభవావసానం చ బ్రహ్మవిజ్ఞానమ్ (2-1-4)' అని యనిరి. బ్రహ్మజ్ఞానమునకు అనుభవమే అవధి.

♦ 'కశ్చిద్ధీరః ప్రత్యగాత్మాన మైక్షత్' (క)

* 'వేదాహ మేతం పురుషం మహాంతమ్' (శ్వే)

శ్రుతి ఇతరుల అనుభవము. అది పరోక్షము. స్వానుభవము అపరోక్షము. అది కలిగినతోడనే శ్రుతితో పని చెల్లు. అతనికి, ‘ వేదా అవేదాః – (బృహ. 4-3-22). వేదము లవేదములు. ’

లౌకికములలో ప్రమాణ ప్రవేశము

శ్రుతివాక్య విచారము. లౌకికము. బ్రహ్మసూత్రములు శ్రుతులను మీమాంసించును. కావున లౌకికములు. ఇట్టి మీమాంసలో ప్రమాణములకు సంచారము. శ్రుతి ప్రామాణ్య మంగీకరించు పూర్వోత్తర మీమాంసలు ఉపక్రమాదు లాఱింటిని* అర్థనిర్ణాయకము లనెను.

హేతువాదము

ఆ యాఱింటిలో ‘ఉపపత్తియు’ నొకటి. ఉపపత్తి విరుద్ధముగ ‘నిప్పు’ చల్లగనుండునని వేయి వేదములు ఘోషించినను ప్రమాణము కాదు. (చూ – గీతాశంకర భాష్య 18-6-6.) కావున శ్రుత్యర్థమును నిర్ణయించుటకు నించుకెఱుకతో పని. ఇం దేమాత్రము పొరపాటు పడినను నిశ్శ్రేయసచ్యుతి, అనర్థప్రాప్తియు– చూ — ‘ తత్రావిచార్య యత్కించిత్ ప్రతిపద్యమానో నిఃశ్రేయసాత్ ప్రతిహన్యేత, అనర్థం చేయాత్ (బ్ర. సూ. భా. 1-1-1). ’ కావున హేతువాదము శ్రుతి కెంత యనుకూలముగ చేయవలసియుండునో మనకు తెలియగలదు.

---

* ఉపక్రమోపసంహారా వభ్యాసో ఽపూర్వతా ఫలమ్.
అర్థవాదోపపత్తీ చ లింగం తాత్పర్య నిర్ణయే.

ఉపపత్తి తదితరములకును ఆధారము

ఉపక్రమోపసంహారములను నిర్ణయింపగలిగిన పిదపనే వానియేకవాక్యతకు ప్రయత్నము కలుగును. కావున, ఈ నిర్ణయములో హేతువాద మాధారము. కొన్నిపట్ల శ్రుతులకు వాచ్యార్థము గ్రహించుచో అనర్థము కలుగును. అచట లక్ష్యార్థము చెప్పవలసియుండును. ఆ లక్షణయు వివిధము. అట్టియపు డనర్థము తెలిసి సరిపడు లక్ష్యార్థమును చేకొనవలెను. అట్టిచో హేతువాద ముపకరించును. మఱియు అర్థవాదాదికము లుండును. వానిన్నిగూడ హేతువు పృథక్కరింపవలెను. వానికిని తగునర్థము నిర్ణయింపవలెను. ఇట్టిపట్టునను హేతువులో పనిపట్టును. ఈరీతిగా శ్రుత్యర్థనిర్ణయమునకు తఱచు ఉపపత్తి ఉపకరణము.

ఉ దా హ ర ణ ము

మొదటి సూత్రమున బ్రహ్మజిజ్ఞాస చెప్పబడెను. 'బ్రహ్మము మన మెఱిగినదా ఎఱుగనిదా? ఎఱిగినదగునేని ప్రయత్నమక్కఱ లేదు. ఎఱుగని దగునేని అంతకంటె అక్కఱ లేదు. ఇక నెందులకీ జిజ్ఞాస? ఈ జిజ్ఞాస కుపపత్తి చెప్పవలెను. అదియిది. బ్రహ్మము తానని ప్రతియొకరు అనుకొందురు. కాని ఎవరును తిన్నగా ఎఱుగరు. అందఱకును ఆత్మాస్తిత్వము తెలియును. నేనులేనని ఎవడును అనుకొనడు (చూ- శాం- భా 1-1-1) మఱియు అనుభవావసానముగా శ్రుతిని మననము చేయవలెను. బ్రహ్మవిచారము చేయనిచో బ్రహ్మజ్ఞానము కలుగదని ఆనందగిరియును. శ్రుతి బృంహణీయము.

యుక్తి ఉపబృంహకము. కాన, శ్రుత్యనుభూతులకది అంగము. (చూ- శాం- భా- 1-1-2, 2-16) తర్కమున కింకను ప్రయోజనము కలదని ఆనందగిరి గౌడపాదకారికలలో చెప్పెను. చూ-గౌ-కా 3-1. శ్రుతికిని యుక్తికిని ఎట్టి చుట్టరికమో యిపుడు మన మెఱుగ గలిగితిమి. బ్రహ్మసూత్రము లిట్టి యుక్తులను అతి ప్రౌఢముగను, అతి గూఢముగను చెప్పెను. శంకరుని భాష్యము ఇట్టి బ్రహ్మసూత్రపేటికకు సువర్ణ కుంచిక.

సూత్ర గూఢార్థ వివరణము

నిగూఢమగు ఆ యద్వైతాత్మవాదమును శంకరు లెట్టుల తెలియ జెప్పిరో యిపుడు పరికింతము.

భేదమును చెప్పునా, అభేదమును చెప్పునా, సవిశేషమును చెప్పునా, నిర్విశేషమును చెప్పునా యని సందియ మొదవించు సూత్రములకు శంకరులు వేదసాహాయ్యము తోడను, పిదప స్మృత్యనుమానాదులయు సాహాయ్యముతోడను అద్వైతార్థమును నిరూపించిరి. దీనికి ఇప్పుడు ముద్రితమయిన ఈ ప్రథమ పాదమునందలి ఆనందమయాధికరణ మొక యుదాహరణము. శంకరులు ఈ యధికరణము నందలి సూత్రములకు పైకి కనబడు అర్థమును చూపి పిమ్మట శ్రుతి స్మృతి సమ్మతమగు నర్థమును తెలిపిరి. బాదరాయణుడు అట్టి యర్థమునే మనసున నుంచుకొని యీ యధికరణమును రచించె నని నమ్మనిచో భగవదుపవర్షుని మతమును ఖండించుటకు శంకరులు వెను దీయ కుందురా ?

సూత సంహిత

మఱియు శంకరులు పదునెనిమిది మాసములు సూత సంహితను పఠించిన పిదప శారీరక మీమాంసాభాష్యమును రచించినటులు పెద్దలు చెప్పుదురు. ఆ సూతసంహిత యిటులు చెప్పుచున్నది.

'తథానందమయ శ్చాపి బ్రహ్మణా న్యేన సాక్షిణా
సర్వాంతరేణ సంపూర్ణో బ్రహ్మణా న్యేన కేన చిత్।
యదిదం బ్రహ్మ పుచ్ఛాఖ్యం సత్యజ్ఞానాద్వయాత్మకమ్
స రసః సర్వదా సాక్షా న్నాన్యథా సురపుంగవాః' (4-3-46)

ఈ సూతసంహిత శంకరుల కీనలిరచన యనువారు ఉండక పోరు. ఐనను ఇట్టి ప్రమాణము లింకను లేకపోలేదు.

శ్రుతి సంగతి

ఆనంద స్వరూపమగు బ్రహ్మమును ఆనందమయము గనే వర్ణించినచో ఆనందమయధర్మవత్త్వమే సిద్ధించును. శ్రుతి తాత్పర్య మదియే యనుటకు వీలులేదు. 'ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్' 'ఆనందము బ్రహ్మమని తెలిసికొనెను' 'విజ్ఞాన మానందం బ్రహ్మ' 'బ్రహ్మము విజ్ఞానము. మఱి ఆనందము,' 'సచ్చిదానందం బ్రహ్మ' బ్రహ్మము సత్తు, చిత్తు, మఱి 'ఆనందము', 'ఆనందాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయంతే' 'ఆనందము వలననే కదా యీభూతములుపొడము చున్నవి,' అను ఈ మొదలగు శ్రుతులు బ్రహ్మమునకు ఆనంద మయత్వరూపమును ఆనందమయ ధర్మిత్వమును చెప్పుట

లేదు. ఇచట ఈ రీతిగా శంకరులు శ్రుతిమీమాంసారూపమగు శ్రుతి సంగతిని ఏమరక శ్రుత్యర్థ మీమాంసారూపమగు బాదరాయణాభిప్రాయమును స్మృతి సంగతముగను పూర్వమీమాంసానురూపముగను వెల్లడించిరి. అనుమానమున కాస్పదమైన కొన్ని జైమిని సూత్రములకు ఉపవర్షుడును శబరుడును పైకితోచు అర్థమునుగాక శ్రుతి సంగతమగు అర్థమునే చెప్పిరి. ఇందులకు శాబరభాష్యము నొదలారయునది. అద్వైతమే శ్రుతిసమ్మత మనియు, అదియే బ్రహ్మసూత్రాభిప్రాయ మనియు తెలిసియే శంకరులు శ్రుతిని హేతుయుక్త్యనుభవములచే మఱింత ధ్రువపఱచిరి. కపిలుడు వేదార్థమెఱుగడని అనుటకు శంకరుల కెంత యద్వైతాత్మానుభూతి ఉండవలెనోకదా! ప్రతిపక్షు లీ వాక్యమునకు కినియక తప్పదు. అస్తు.

శంకరులకు తొల్లిటి సూత్రకర్తలును, శాస్త్రకర్తలును వేదాంతమతఖండనము పేర అద్వైతమునే ఖండించిరి. శాండిల్యుడు 'ఆత్మైకపరాం బాదరాయణః' (30) అను భక్తి సూత్రమున బాదరాయణునిది అద్వైతమని చెప్పెను.

అద్వైతము శ్రుతిగమ్యమే

నిర్గుణబ్రహ్మమునకు శ్రుతియే ప్రమాణము. బ్రహ్మ మెవరికిని భిన్నమగువస్తువు కాదు. దృశ్యమును కాదు. దృశ్యము తనకు వేరుగా కానవచ్చునది. అది భేదసత్త్వాధీనము.

శ్రుతి నిషేధముఖముగనే ప్రమాణము. శ్రుతి అసంగము, అప్రమేయము, నిర్గుణము, ఇత్యాదిగా బ్రహ్మ

మును చెప్పుటచేసి అట్టి వృత్తియే బ్రహ్మము నెడ సంభావ్యము. మనము కుండను చూచునపుడు వృత్తి, కుండ దెస వ్యాపించును. దానికి ఫలముగా 'నేను కుండను చూచితిని' అని అందుము.* బ్రహ్మము కుండవలె మనకు వేఱుగా కానదగినది కాదు; కాన బ్రహ్మము 'నేను అసంగమగు బ్రహ్మమను' అను వృత్తికి విషయముగా సంభావ్యము. 'నేను కుండను చూచుచున్నా' నను రీతి ఎవడును నేను బ్రహ్మమును చూచుచున్నానని అనలేడు. ఏలయనగా బ్రహ్మము కుండవలె మనకు వేరు కాదు.†

మఱియు బ్రహ్మము నిరాకారము గాన ఆ వృత్తి బ్రహ్మాకారము తాల్పబోవునపుడు మెల్లమెల్లగా నశింపజొచ్చును. అపుడది ప్రసవించిన ఎండ్రి. ఇటులు కొలది కొలదిగా వృత్తినాశముచే కలుగు ననుభవమున బుట్టు సంస్కారముచే అద్వైతజ్ఞానము సంపూర్ణముగా కలుగును సంపూర్ణమగు వృత్తినాశముగూడ అనుమింపబడును. అథవా కల్పింపబడును. అట్టి అద్వైత బ్రహ్మాకారత శ్రుతిప్రమాణముచేతనే సంభావ్యముగాని హేతువాద మట కబోది.

ఇతరులు భ్రాంతులా?

శంకరులు వివిధవాదములకు ఎంతయో గుఱియగుచున్న బ్రహ్మసూత్రములకు అద్వైతమే అభిప్రాయమని తమ భాష్యముచే నిరూపించిరి. ఇటులగుచో భాస్కర

* సేతుబంధము - 7 శ్రామ - 75, 76 చూ.

† అపరోక్షానుభవమును తెలుపవలయునపుడు దీనికి వేఱుగా శక్తమగు భాష లేదు గాన — 'వేదాహ మేతం'.

రామానుజాదులు భ్రాంతులా? యను ప్రశ్న తప్పక పుట్టును. శ్రుత్యర్థ నిరూపణమునకు అవలంబించిన తర్క వాదములందు కాని, అధికరణాది విభాగాదులందుగాని, తత్త్వముల వేర్పఱచుటయందుగాని ఖండనము నందు గాని శంకరు లెంత నైపుణిని చూపిరో, వారును అంత నైపుణిని చూపిరి. వారు నిక్కముగా విజ్ఞానమూర్తులే. వారందఱును అధ్యేయులు. వారిని సంపూర్ణముగా తెలిసికొననిదే అద్వైతవాదము తెలిసె ననుకొనుట చాలు. బ్రహ్మవిజ్ఞాన మనుభవావసానముగాన గుర్వాపదిష్ట మగు మార్గ మవలంబించి సత్య మెఱుగుట ఆవశ్యకము. కాని 'ఒకరు భ్రాంతు లనియు, మఱియొక రభ్రాంతు లనియు వాదించుట ఎందులకు? ఆపని శాస్త్ర కర్తలది.

శంకరుల యోగైశ్వర్యము, కవితావైభవము మొదలగు విషయములు తెలిపి గ్రంథాకారమును తాల్చుచున్న యీ పీఠికను పాఠకుల ముందు ఇంకను విస్తృతము చేయ నొల్లను.

శ్రీ లింగన సోమయాజిగారు -- అనువాదము

శ్రీ లింగనసోమయాజిగారి తండ్రి తాతలు యజ్వలై ధర్మామృతమును వర్షించినవారు. వీరి తండ్రిగారు తర్క వేదాంతములందే గాక ధర్మశాస్త్రము లందును పరిశ్రమ మొనరించిన వారు. కావుననే శ్రీ లింగన సోమయాజిగారు తమ తండ్రిగారినిగూర్చి 'సాహిత్య తర్క వేదాంత ధర్మశాస్త్ర

పురాణవిత్' అని తమ తైత్తిరీయ కల్యాణవివరణవ్యాఖ్యలో చెప్పిరి.

జగద్గురువులగు శ్రీ కల్యాణానంద భారతీమాంతా చార్యులవారు వీరి కాచార్యులు. వీరెల్లప్పుడును బ్రహ్మామృత మును వర్షించువారు. ఇట్టివి ఈ యుభయవంశములు!

శ్రీ లింగన సోమయాజిగారు ఆంధ్ర సంస్కృతాంగ్లభాషా పారంగతులు. వీరు ముప్పదేండ్లనుండియు సంస్కృతభాషా వ్యాప్తికి కంకణము కట్టుకొనిరి. మహాసభలలో సంస్కృత భాషోపన్యాసమును తేటతెల్లముగను, వీనులవిందుగను జేసి చేయుచునున్నారు. కొలదికాలముక్రింద ఒక మెట్టెక్కి గ్రంథ రచనకు పూనుకొనిరి. అదియు సంస్కృతరచన. విశేషించి వ్యాఖ్య. దీనికిని దానికిని కాదు. వేదాంతపంచదశికి. పండితు లును, పీఠాధిపతులును ఆపీయూషమాధుర్యము గ్రోలిరి. దాన నుత్సాహితులై వీరు తైత్తిరీయభాష్యమునకును. సురే శ్వరవార్తికమునకును గురుభక్తివ్యంజకముగా కల్యాణ వివరణ మను సంస్కృతవ్యాఖ్యను వెల్లడించిరి. తా మెంతేని గురుభక్తి గలవారయ్యును ఈవ్యాఖ్యచే సంస్కృత భాష ఎంత కొలదిగ వచ్చినవారికిగూడ గురువుతో పనిలేకుండ జేసివైచిరి. ఇటుపై ఇంకొక మెట్టెక్కి తా మెక్కదలచిన శిఖరమున కవలంబముగా ఉపనిషద్భాష్యమునకు తెలుగు వ్యాఖ్యానమును ప్రవహింప జేసిరి. ఎన్నిమారులో మననము చేయనిదే మూలమును చదువుకొనుచుపోయినంత ఏ యుపని షత్తు కా యుపనిషత్తుయొక్క అర్థము అఖండముగా స్ఫురించు

టరిది. ఈ తెలుగువ్యాఖ్యాన మీ అసాధ్యసాధనము చేసెను. ఇపు డిట్టి వీరికృషివలన కొన్ని ఉపనిషత్తులను కొన్ని నిముషములలోను, కొన్ని గంటలలోను గడగడ క్రోలగలము. తెలుగువారి కిట్టి ఉపకృతి చేసినందులకు శ్రీ లింగన సోమయాజిగారికి జే యందును.

కల్యాణ కౌముది

ఇపుడు వీరు బ్రహ్మసూత్రములపై శ్రీ శంకరుల శారీరకమీమాంసాభాష్యమును తెలుగున జెప్ప బూనిరి. ఉపనిషత్తుల కర్థవివరణ మొకయెత్తు, శారీరకమీమాంసా భాష్యము ననువదించు టొకయెత్తు. బ్రహ్మసూత్రము లొక విధముగా హేతువాదములు. 'బ్రహ్మసూత్ర పదైశ్చాపి హేతుమద్భిః' అని గీత. ఇక భాష్యమా యుక్తుల కేమి, ఉపమానముల కేమి, ఉదాహరణముల కేమి, అనుభవముల కేమి ఇసుకపాతర. మఱియు ఇది ఒక తర్కారణ్యము. ఏ మూల నుండి పూర్వపక్షము పుట్టుకొనివచ్చునో, ఏమూల నుండి ఉత్తరపక్ష ముప్పతిల్లునో తెలియు టరిది. ఈ ప్రథమపాదమున ముప్పదొక్క సూత్రములు మాత్రము కలవు. ఇవి పదునొకండు విషయములకు,అధికరణములకు సంబంధించినవి. శ్రీ లింగన సోమయాజులుగారు న్యాయవాదులుగాన ఈయధికరణమునకు శ్లేషచే న్యాయస్థానము-కోర్టు-అనియు అర్థము చెప్ప గలిగిరి. ఈ యర్థ మెంత చక్కగ నున్నదో సహృదయు

లకు. తెలియక పోదు. వీరి యీ తెలుగు రచన స్వతంత్ర రచన యని యనిపించును. ఒక్కొక్క అధికరణ మొక్కొక తీర్పువలె, తీర్పుతో గూడిన ఆధ్యాత్మిక కథవలె భాసించును. అంతట కుతూహలము కలిగించి పాఠకులను పై యధికరణములో ప్రవేశపెట్టును. అదియు తనపని తా ముగించి పై యధికరణములో దిగబెట్టును. ఈ రీతిగా ఈ రామానుజుడు ప్రతర్దనాధికరణమువఱకు పాఠకులను తీసికొని పోవును. పాఠకులారా! నామాట కల్లయేమో, దయచేసి జిజ్ఞాసాధికరణములో ప్రవేశించి చూడుడు.

మన్మథ. చైత్ర శు॥ 25—3—55

వేలూరి శివరామశాస్త్రి,
చిరివాడ.

ఆముఖము

ఆర్షవిజ్ఞానమున కాకరమగు నుపనిషత్కదంబమున ముఖ్యములగు నీశావాస్యాది దశోపనిషత్తులకు నేకవాక్యతాపూర్వకమగు నర్థసమన్వయము చేయదలంచి హేతువాదవిలసితము లగు బ్రహ్మసూత్రముల బాదరాయణాచార్యుడు రచియించెను. ఉపనిషదుపదిష్టమగు నాత్మతత్త్వము ననుభవము చేసికొను మార్గము నర్జునునకు శ్రీకృష్ణభగవాను డుపదేశించెను. ఉపనిషత్తు లుపదేశగ్రంథములు. బ్రహ్మసూత్రములు హేతువాదగ్రంథము. భగవద్గీత లనుభవగ్రంథము. ఈ మూడు నాధ్యాత్మికతత్త్వమును సంపూర్ణముగ గ్రహించుటకు ప్రకృష్టములగు స్థానము లగుటం జేసి ప్రస్థానత్రయ మని పండితలోకమున ప్రసిద్ధి గాంచినవి. శ్రీ శంకరభగవత్పాదు లీ గ్రంథత్రయమునకు సంస్కృతమున నమూల్యములగు భాష్యముల వ్రాసిరి. వీరి భాష్యశైలి ప్రసన్నగంభీరము, విద్వాంసులకు గూడ నౌషధకల్పమునై, భామతీ న్యాయనిర్ణయ రత్నప్రభాది వ్యాఖ్యానానుపానముచే రుచిర మగుచున్నది. ఇంతకు బూర్వము పెద్ద లుపనిషత్తుల గొన్నింటి నాంధ్రమున ననువదించిరి. నేను నీశాది దశోపనిషత్తుల నుపనిషచ్చంద్రిక యనుపేర సభాష్యవివరణాత్మకమగు నొక సంపుటషట్కము నాంధ్రమున కొలదికాలము క్రిందట ప్రచురించితిని. గీతలకగణ్యములగు నను

ప్రస్థానత్రయ భాష్యము

పూర్వానువాదములు

వాదాదులు ప్రచుర ప్రచారమున నున్నవి. కాని శాంకర రచనల నన్నిటికంటెను ప్రౌఢతమము, ప్రశస్తతమము నగు శారీరకమీమాంసాభాష్యమున కింతవఱకు దగు నాంధ్రానువాదము కాన్పింపదు. విఖ్యాతపండితప్రవరులగు పురాణపండ మల్లయ్యశాస్త్రిగారు శ్రీ పిఠాపురాధీశ్వరుల యధ్యక్షత క్రింద నొక ఆంధ్రానువాదమును బ్రకటించిరి. కాని యా గ్రంథ మిపుడు లభ్యమగుట లేదు. బాదరాయణసూత్రసంగ్రథితములు, శాంకరభాష్యసువర్ణస్థగితములు నగు వేదాంత వాక్యరత్నములు సంస్కృతభాషాపేటికయందు బదిలములగుటంజేసి యాభాషా కీలిక నెఱుంగని వారి కయ్యవి యలభ్యములగుచున్నవి. ప్రాంశులభ్యములగు ఫలములకు చేయిచాచు లుబ్ధవామనునింబోలు నే నాంధ్రసారస్వతమున కిట్టి కొఱంత దీర్పగోరి శాంకరసూత్రభాష్యము నాంధ్రమున బ్రతిపదముగ ననువదింప బూనితిని. ఈ రచన శాస్త్రవిషయము కాని సాహిత్య విషయముకాదు. భాషకంటె భావమునకు బ్రాధాన్యము నొసంగితిని 'వాక్యేతు సా వివక్షామపేక్షతే'

ప్రకృతానువాద వైలక్షణ్యము

యను సంధినియమమును బాటించుచు శైలిని విషయానురూపముగ సాధ్యమైనంత తక్కువ స్థాయిని నడిపించితిని. మాతృకను సరియగు ననువదనవిధానము ననుసరించినను భావకాఠిన్యమును సవ్యరూపమున బ్రదర్శింప యత్నించితిని. గ్రంథ ముద్రణానువాదరచనలయం దాధునిక మార్గము నాశ్రయించితిని. పూర్వోత్తరాధికరణములకును, సూత్రముల

కును గల పరస్పర సంబంధము, విషయవాక్యసముచ్చితమగు విషయవిశయాది పంచావయవనిరూపణము, అవసరముగ నవలోకనీయము లగు ప్రమాణవాక్యములు అవి లభ్యములగు స్థానములు, సూత్రప్రతిపదార్థము, పూర్వపక్ష సిద్ధాంత వాక్యవిభాగము, క్లిష్టస్థలములయందు కుండలీకృత మగు భాష్యార్థవివరణము, విషయ సముచితములగు నవతారికలు, అధికరణార్థసంగ్రహము, విషయ శీర్షికలు, విషయసూచిక, అకారాది సూత్రపట్టిక మొదలగు విషయగ్రహణమునకు సుకరము లగు నూతనవిధానముల నిచట బాటించితిని. రత్నప్రభ, ఆనందగిరి; భామతీ సదాశివేంద్ర కృతవార్తికాది వ్యాఖ్యానములలోని విశేషముల యథోచితముగ బొందుపఱచితిని. ప్రమేయమంతయు నుపనిషద్వాక్యార్థ విమర్శనముతో గూడుకట్టుకొని యుండుటచే మున్ముందు దశోపనిషత్తుల పరిచయము గలవారికిగాని భాష్యార్థగ్రహణము సుకరముకాదు. కొన్నిపట్టులయందు గురుముఖమున సంప్రదాయసిద్ధముగ శ్రవణమపేక్షితము కావచ్చును. ఈ శాస్త్రమునకు బ్రహ్మవిద్య యను నామ మన్వర్థము. ముద్రణానువాద రచనలయందు నూతన విధానము ననుసరించి రచియించి యాంధ్రలోకమున కర్పింపబడు నీ కృతియౌచిత్యమునుగూర్చి చదువరులే ప్రమాణము.' జ్ఞాతాజ్ఞాతములగు ముద్రణాది ప్రమాదములు క్షంతవ్యములు.

నాకు గురుపుంగవులగు ప్రాతఃస్మరణీయనామధేయ భారతీ సంప్రదాయ సార్వభౌమ జగద్గురు శ్రీ కల్యాణానన్ద

భారతీమాస్వాచార్య పూజ్యపాదుల ఆశీస్సులు లేక నాకు ఈ యనువాదాది రచనాసామర్థ్యము అలవడ నేరదు. వారి

కృతజ్ఞత

కల్యాణవిగ్రహము నా కనిశము సన్నిహితముగ నుండునటుల మనఃపీఠమున నెలకొల్పుకొని నిత్యార్చన నాచరించుచుందును. గడచిన యిరువదిరెండు సంవత్సరములలో వారు నా యెడజ్జూపిన శిష్యవాత్సల్యమున కానృణ్యము నొంద నాకశక్యము. నా కృతుల యందు కల్యాణాత్మక మగు వారి నామసంకలనమున మాత్రము కౌత్సునివలె గురుదక్షిణ నొసంగగలను. ఈ యనువాదమునందు నాకమూల్యమగు సాహాయ్య మొనర్చిన పండిత ప్రవరులకును, పూజ్యమిత్రులకును కృతజ్ఞతాపూర్వకములగు వందనము లర్పించుచున్నాను. తర్క వేదాంత విశారదులగు, బ్రహ్మశ్రీ వేదమూర్తి మద్దులపల్లి మాణిక్య శాస్త్రిమహాశయులు, మాండలిక వేంకటశాస్త్రి మహోదయులు నా యధ్యాసభాష్యానువాదమును విని సంతసించి ముందు గ్రన్థ మప్రతిహతముగ సాగునటుల వారి యాశీర్ముద్రిక సద్ధానియందు నెలకొల్పిరి. ఆంగ్లసారస్వతమున ఎం. ఏ. పట్టభద్రులు, వేదాంతశాస్త్రనిష్ణాతులు నగు శ్రీ కజ్జా వేంకటాద్రివుగారు నా ఉపపచ్చంద్రికామయూఖమండలమును, వేదాంతపంచదశి నెంత పాండిత్యప్రకర్షతోను, శ్రద్ధతోను విమర్శించిరో అంతకంటె నినుమడించు శ్రద్ధతో నీ యనువాదము ప్రథమాధ్యాయము నంతయు బరిశీలించి విమర్శనాపూర్వక మగు వారి వేదాన్త విజ్ఞానకౌశలమున ముద్రాంకితము చేసిరి. సంస్కృతాంధ్ర విద్వత్కవివరులును, పాణిని

బాదరాయణ సూత్రనిబద్ధబుద్ధి కుశలులును, నాకు వంద్యమిత్రులును అగు బ్ర. వే. కవుతా నరసింహశాస్త్రిగారు నా అనువాదము కొంతభాగమును, తమ్మవరపు వేంకటరంగయ్యగారు ఆంతముగను జదివి అమూల్యములగు సూచనల నిచ్చిరి. వీర లందఱికిని నా యథమర్ణతను వెలిబుచ్చుచున్నాను.

అనారోగ్యము నిసుమంతయు పాటింపక నేను గోరిన వెంటనే ఎట్టకేలకు ఓపికబట్టి ఈ యనువాదమునకు నిజప్రభాప్రతిబింబితమగు చక్కని తొలిపలుకును బలికి నన్ను ఆశీర్వదించిన బ్ర. వే. వేలూరి శివరామశాస్త్రిగారికి కృతజ్ఞతాభివందనముల నర్పించుచున్నాను. కొట్టవచ్చునట్టి బ్రహ్మవర్చస్సునకు అనురూపమగు సహజప్రజ్ఞ, ప్రజ్ఞకు సదృశమగు సర్వతంత్రస్వాతంత్ర్యము, స్వాతంత్ర్యమునకు దులతూగు ఆరంభములు, ఆరంభములకు సరిపోవు వివిధవైజ్ఞానిక కవితావైభవోదయము; ఇవి అన్నియు, 'ఆకార సదృశ ప్రజ్ఞః, ప్రజ్ఞయా సదృశాగమః ఆగమైః సదృశారంభః ఆరంభ సదృశోదయః' అను చిన్ననాటిశ్లోకముతో పాటు ఒక్కమారుగ స్మృతి పథమున విహరించుచున్నవి. ఇంకను ఎన్నియో సంగతులు జ్ఞాపకమునకు వచ్చుచున్నవి. కాని, 'జగమెఱిగిన బ్రాహ్మణునకు జందెమేల' అను ఆభాణకము నా కలమునకు అడ్డువచ్చుచున్నది. శ్రీ శాస్త్రిగారు తమను గూర్చి చెన్నపట్టణపు శతావధాన సమయమున చెప్పుకొనిన

నయవినయాదిగుణోపేతమగు పద్యమునుమాత్రము ఇందులో పొందుపఱచెదను.

పారమైశ్వర్యంబు పాఱ జూచిన మహో
దాత్తుండు మాదు ముత్తాతగారు
జన్నంబుచేయుపై జందెంబు దీసిన
తద్జ్ఞశేఖరుడు మా తాతగారు
వేదవేదాంగాదివేత్త, చమత్కార
తరవాగ్విహర్త మా తండ్రిగారు
కవితచే నాంధ్రలోకమునందు రసమును
గురుపించువారు మా గురువుగారు

సరవిగానిద్ది యుభయవంశ ప్రసిద్ధి
నేను పండితపుత్త్రుండ నిక్కమిద్ది
నొక్కిచూచిన నాకిల్లె డొక్కశుద్ధి
నామమా! పెద్దదే — శివరామశాస్త్రి.

శ్రీ శాస్త్రిగారు నిక్కముగ పండిత పుత్త్రులే; నేనుగూడ పండిత పుత్త్రుడనే!

గడచిన యిరువది సంవత్సరముల నుండి పెద్దన్నగారికి అర్హమగు గౌరవప్రేమలతో నాయెడ మెలంగుచు నే జేసిన అల్పసేవకు సి.వి.డి.కంపెనీ లిమిటెడ్, నర్సాపురం బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు వైయక్తికముగ నా కొసంగిన వేయునూట పదునాఱు రూప్యముల ఉపాయనమును ఈ సంపుటముద్రణమునకు వెచ్చించితిని. వారలందఱికి నాకృతజ్ఞతాపూర్వకము లగు వందనములు.

ఈశాది దశోపనిషత్తులలో ముఖ్యముగ ఛాందోగ్యమున పెక్కు వాక్యములు సాంఖ్యాది దర్శనకర్తలకు పరస్పర విరుద్ధార్థములుగ కాన్పించి వారలను బ్రహ్మసూత్ర రచన కలవర పెట్టినవి. అట్టి వాక్యముల యర్థసమన్వయము చేసి వానికి ఏకవాక్యతను ప్రదర్శించుటయే సూత్రకారుల ముఖ్యాశయము. శరీర మాటపట్టుగా గల జీవుని తత్త్వనిశ్చయము చేయుటచే నీశాస్త్రము శారీరకమీమాంస యని చెప్పబడుచున్నది. ఇందు నాలుగేసిపాదములుగల నాలుగధ్యాయములు, ప్రతిపాదమునందనేక సూత్రసంకీర్ణములగు నధికరణములు మొత్తముమీద నాలుగధ్యాయములు, పదునాఱు పాదములు, శాంకరభాష్యానుసారముగ నూటతొంబదిరెండధికరణములు, 555 సూత్రములతో నీశాస్త్రమలరారుచున్నది. సందిగ్ధార్థమగు నొక్కొక్కయంశ మొక్కొక్క యధికరణవిషయమగుచున్నది. అధికరణములు, వానియందలి సూత్రములుగూడ పూర్వాపూర్వసందర్భనిబద్ధములు, హేతుహేతుమద్భావ సముచితోపేతములు, యుక్తియుక్తములు నగు విషయవిభాగములతో విలసిల్లుచున్నవి. అధికరణమన విషయనిర్ణయముచేయు న్యాయస్థానమనందగును. ఇక్కాలపు న్యాయస్థానముల గాన్పించు నుభయవాదప్రతిపాదనము, నిర్ణేయములగు సారాంశములు, ఇరుపక్షముల కాధారభూతములగు ప్రమాణములు, వాని ప్రామాణ్యార్థ నిర్ణయాది విమర్శనము, ఫలితము మొదలగు న్యాయనిర్ణయవిధాన మంతయు ప్రత్యధికరణమున

గాన్పించుచు, నచటి విషయ విన్యాస విధానమంతయు విశాలపు న్యాయవాదుల కెంతయు హృదయంగమముగ నుండును. విచార్యమగు విషయము, అచటి విమృశ్యమగు సంశయము, పూర్వపక్షము, సమాధానము, నిర్ణయము ననునీ పంచావయవములతో గూడినది యధికరణ మని మీమాంసకుల సంకేతము. అర్థనిర్ణాయకము లగు హేతువులు సూత్రరూపమున నతిసంక్షేపముగ చేర్పబడినవి. "స్వల్పాక్షర మసందిగ్ధం సారవ ద్విశ్వతోముఖం అస్తోభ మనవద్యంచ సూత్రం సూత్రవిదో విదుః" అని శాస్త్రకారులు సూత్రలక్షణ నిరూపణము జేసిరి. కొలదిపదములు గలిగి సారవంతము బహ్వర్థబోధకము, అమాయికము, అనింద్యము నగు నర్థమును దెలియజేయునది సూత్ర మనిపించుకొనును.

శాంకరభాష్య విశిష్టత

బ్రహ్మసూత్రముల కనేకులు శంకరుని కంటె ప్రాచీనులు, అర్వాచీనులు గూడ వ్యాఖ్యానములను, భాష్యములను వృత్తులనుగూడ వ్రాసిరి. కాని శాంకరభాష్యప్రచారమునకు పిదప ప్రాచీనవ్యాఖ్యానము లన్నియు నంతరించి నట్లున్నవి. శ్రీశంకరభగవత్పాదుల భాష్యమద్వితీయము. దర్పణమువలె సుప్రసన్నము; సముద్రమువలె నతి గంభీరము; ఇక్షుఖండమువలె ప్రతిపర్వరససంభరితమునై చవిచూచిన కొలది నూతనరుచుల బుట్టించును. పవిత్రము ప్రాతస్స్మరణీయము నగు వారి నామము, బుద్ధికౌశలమునకును విషయ విస్తృతికిని పరమావధి. బ్రహ్మసూత్రములయందు ప్రతిఫలించుచున్న

బాదరాయణహృదయమును యథాస్థితి గ్రహించలేక సాంఖ్యాదివివిధదర్శనకర్తలు కల్పించిన తారుమారును జక్కబఱచి శంకరులు యథార్థమగు సూత్రహృదయమును తమ భాష్యముఖమున జిజ్ఞాసులోకమున కందజేసిరి. బాదరాయణసూత్రనిబద్ధసువర్ణమాలావిభూషితము నౌపనిషదము నగు నద్వైతసిద్ధాంతరాజము దుష్టతర్కకర్కశములు నవైదికములు నగు విమతముల దాడులకు లోనుగాకుండు నటుల నప్రతిహతబుద్ధికుశలతానిర్మితము, శ్రుతియుక్తి గురూక్తవాద త్రితయమునగు భాష్యదుర్గమున బరిరక్షించిరి. సర్వమునకు నాత్యంతికకారణ మగు బ్రహ్మమొక్కటియే జిజ్ఞాస్యమనియు, బ్రహ్మ మొక్కటి తెలిసిన నద్దానివలన బుట్టిన జగచ్చిత్ర మంతయు దెలియునగు ననియు, నట్టి బ్రహ్మము మానుషశేముషీవిషయముగాక శాస్త్రైకవేద్య మనియు, ఉపనిషన్నిచయమున కంతకు నద్వితీయబ్రహ్మమునందే సమన్వయ మనియు, ఇదియ బ్రహ్మసూత్రైకతాత్పర్య మనియు భాష్యకారులు బ్రదర్శించిరి. బ్రహ్మసూత్రములన్నియు నద్వితీయబ్రహ్మైక ప్రతిపాదన పరములని సిద్ధాంతము సేయ సమకట్టిన తమ భాష్యమునందవిచారితమతులకు మోహజనకములు విశ్వాసపాత్రములు నగు సాంఖ్యాది మతాంతరుల అవైదికసిద్ధాంతముల నిరసనముంగూడ చేయక తప్పినదికాదు. వేదావిరుద్ధములగు వారి సిద్ధాంతముల నంగీకరించిరి. అన్యమతము లద్వైతమునకు విరుద్ధములైనను అద్వైత మన్యమతములకు విరుద్ధము కాదని

ప్రదర్శించుటయే సూత్రకారుల సమన్వయసిద్ధాంతతాత్పర్యమునియు నిరూపించిరి. విషయ వైశద్యము పఠితృజనసౌముఖ్యమును గోరి తమ భాష్యరచనము నంతయు వాదకథనరూపమున నడిపించిరి. అట్టి రచనయం దద్వైతవాది సిద్ధాంతకోటిన నిలుచుటయు తదన్యులందఱు ప్రతిపక్షకోటిన నిలచుటయు సహజము. వీరందఱును తత్త్వనిశ్చయకాములై యెవ్వరి వాదమునకు వారు ముఖ్యులయినను తదితరవాదములపట్ల విముఖులు గాక విషయనిర్ణయప్రచోదకము లగు ప్రశ్నలచే తత్త్వనిశ్చయమునకు సహాయపడుచుండిరి. ప్రతిపక్ష రాద్ధాంతముల నాయా మతప్రవర్తకుల కంటె నెక్కుడు నైపుణ్యము తోడను బిగితోడను భాష్యకారు లుపపాదించిరి. శాంకరభాష్యరచన యందు వాదకథనవిధానమెంత విలక్షణమో ప్రతివాది మతప్రతిపాదన మంతకంటె విలక్షణతరముగ నుండును. కాదాచిత్కమగు ప్రతిపక్ష పరిహాసము గూడ వైరస్యవిదూరము ద్వేషాదూషితము సౌహార్దసమర్థితమునై ప్రతిపక్షులకుం గూడ ప్రరోచన కారణమగుచున్నది. భాష్యశైలి యనన్యసామాన్యము, అననుకరణీయము, గజగమనము వలె నత్యంతము హృదయంగమమై శాస్త్రసారస్వతమునకే గాక సాహిత్యసారస్వతమునకుం గూడ మెఱుంగు వెట్టుచు నుత్తమస్థానము నలంకరించుచున్నది.

జగత్తున కాత్యంతిక కారణ మగు పరబ్రహ్మ మొక్కటి

సూత్రము జిజ్ఞాస్యమనియు, సర్వోపనిషత్తుల కన్నిటికి నద టనే సమన్వయమనియు బోధించుటయే ప్రతిపాద విషయము శాస్త్రప్రయోగయ మనియు నాదిమసూత్ర చతుష్టయము నందు శారీరక శాస్త్ర మంతయు సంక్షిప్తము చేయబడినది. శేషించిన సూత్ర సంచయ మంతయు వ్యాఖ్యారూపమై హేతుహేతు మద్భావ క్రమముగ విస్తరింపబడినది. ప్రథమ ద్వితీయాధ్యాయ ములు సిద్ధబ్రహ్మ విషయకములు. తృతీయ చతుర్థా ధ్యాయములు సాధ్యవిషయకములు. బ్రహ్మమే అశేష వేదాంతవాక్యజాతము యొక్క యఖండార్థమని ప్రథమా ధ్యాయమున సమన్వయము చేయబడుటచే నయ్యది సమన్వ యాధ్యాయ మను నామమున బరగుచున్నది. మతాంతరులచే స్వపక్షమున జూపబడిన దోషముల వారించి వారి దోషముల ప్రదర్శించుటచే ద్వితీయాధ్యాయము విరోధాధ్యాయ మని చెప్పబడుచున్నది. బ్రహ్మవిద్యాసాధనములు సాధనాధ్యాయ మని చెప్పబడు తృతీయాధ్యాయమున వివరింపబడినవి. ఫలాధ్యాయ మను నంతిమాధ్యాయమున బ్రహ్మవిద్యాఫలము నిర్ణయింపబడినది. స్పష్టముగ బ్రహ్మమును సూచించు లింగ ములతో గూడిన శ్రుతివాక్యవిచారణ ప్రథమాధ్యాయ ప్రథమపాదమునందును, అస్పష్టబ్రహ్మలింగవాక్యవిచారణ ద్వితీయ పాదమునందును, జ్ఞేయనిర్గుణబ్రహ్మవిషయకవాక్య విచారణ తృతీయ పాదమునందును, సందిగ్ధపదార్థవివరణము చతుర్థ పాదమునను జేయబడినవి. ద్వితీయాధ్యాయము ప్రథమ

పాదమున. సాంఖ్యయోగ కాణాది దర్శనములచే నద్వైత మునం దాపాదింపబడు దోషములు నివారింపబడినవి. ద్వితీయ పాదమునందు కేవలయుక్తివాదముచేత సాంఖ్యాదిమతముల యందలి దోషప్రదర్శనము చేయబడినది. తృతీయపాదము పూర్వభాగము నందు పంచ మహాభూతసృష్టి శ్రుతుల యొక్కయు నుత్తరభాగమునందు జీవవిషయకశ్రుతుల యొక్కయు వైరుధ్యము పరిహరింపబడినది. చతుర్థపాదము నందు సూక్ష్మశరీరశ్రుతుల యందలి పరస్పరవిరోధము వారింపబడినది. తృతీయాధ్యాయము ప్రథమపాదమున జీవుని లోకాంతరగమనాగమనవిచారణయు, ద్వితీయపాదము పూర్వభాగమున త్వంపదార్థవిచారణయు, నుత్తరభాగమున తత్పదార్థ విచారణము చేయబడినది. తృతీయ పాదమున తత్త్వమసి యను మహావాక్యార్థవిచారణయు, చిత్తైకాగ్ర్య హేతువు నిర్గుణ జ్ఞానోపయోగియు నగు సగుణ విద్యావిచారము చేయబడినది. చిత్తైకాగ్ర్యహేతువు నిర్గుణవాక్యార్థ జ్ఞానోపయోగియునగు సగుణవిద్యావిచారము చేయబడినది. చతుర్థ పాదమునందు, నిర్గుణబ్రహ్మజ్ఞానమునకు బహిరంగ సాధనములగు ఆశ్రమ ధర్మాదులు, అంతరంగిక సాధనములగు శమ దమశ్రవణ మననాదులు వివరింప బడినవి: నాల్గవ అధ్యాయము ప్రథమపాదమున శ్రవణాదులకు నిర్గుణ బ్రహ్మము ఫలమనియు, ఉపాసనాదులకుసగుణ బ్రహ్మము ఫల మనియు, బ్రహ్మజ్ఞానము నకు జీవన్ముక్తి ఫల మనియు జెప్పబడినది. ద్వితీయ పాదమున ప్రాణోత్క్రమణప్రకారము, తృతీయ

పాదమున సగుణబ్రహ్మజ్ఞాని గతియు, నిర్గుణ సగుణబ్రహ్మజ్ఞాన ఫలములు, చతుర్థపాదపూర్వోత్తర భాగములయందును చెప్పబడినవి. ఇటులాపాత మగు వివిధశ్రుతుల యందలి పరస్పర వైరుధ్యమునకు సామరస్యము కల్పింపబడి వాని యేకవాక్యత ప్రదర్శింపబడినది. శాస్త్రారంభమున నుపక్రమింపబడిన అద్వితీయ బ్రహ్మస్వరూప మధికారి భేదానురూపముగ జ్ఞేయోపాస్యరూపమున నుపసంహారమునందు నిగమనము సేయబడినది.

ఆధ్యాత్మికచింతకుల సూక్ష్మబుద్ధు లన్నియు జగజ్జీవ బ్రహ్మము లను క్లిష్టతమమగు నీ సమస్యాత్రయము నెడ మొక్కపోవుచున్నవి. ఈసమస్యాత్రయము యొక్క యాథాత్మ్యమును ముముక్షులోకమునకు ప్రసాదించుటయే ఆధ్యాత్మికశాస్త్రము యొక్క పరమావధి. బాదరాయణాచార్యుడు ఈసమస్యాత్రయమునకు సమాధానమునే తన బ్రహ్మసూత్రములయం దనుగ్రహించెను. భగవత్పాదులు బాదరాయణ హృదయమును తమ భాష్యమునందు వెల్లడి చేసిరి.

ఏక విజ్ఞానశ్రుతి ప్రయోజనము.

“జ్ఞానాదేవతు కైవల్యం, నాన్యఃపంథా విద్యతేఽయనాయ” యనుశ్రుతి కైవల్యము బ్రహ్మజ్ఞానైకసాధ్య మని అన్వయవ్యతిరేకములచే చాటుచున్నది. అందువలననే బ్రహ్మము జిజ్ఞాస్యమని బాదరాయణుడు ప్రథమసూత్రముననే యుపదేశించెను; మఱియు బ్రహ్మవిజ్ఞానము సర్వకారణ మని “కస్మిన్ను విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి” యను శ్రుతియం దుదాహరింపబడిన-

యొక్క విజ్ఞానతత్త్వమును తన రెండవసూత్రమున సూచించెను. సువర్ణజ్ఞానముచే సర్వసువర్ణాభరణముల యొక్క యథార్థజ్ఞానము కలిగినట్లు బ్రహ్మజ్ఞానముచే బ్రహ్మజన్యమగు సమస్తవస్తుసంతానముయొక్క యథార్థజ్ఞానము గల్గునని తాత్పర్యము. అనగా కారణమగు బ్రహ్మము తెలిసిన కార్యమగు జగత్తుయొక్క యాథార్థ్యము తెలియునని యర్థము. బ్రహ్మజ్ఞానమెటులగలుగును? బ్రహ్మజ్ఞానముచే లభించు సర్వవిషయకజ్ఞానమననేమి? అట్టి సర్వవిషయకజ్ఞానప్రయోజనమేమి? జ్ఞాతవిషయముఖమున నజ్ఞాతవిషయమును తెలియనగును. బ్రహ్మ మజ్ఞాతవిషయము. జగత్తు జ్ఞాత విషయము. జగత్తు బ్రహ్మకార్యము. జగత్తుయొక్క జ్ఞానముచేతనే యద్దాని కారణమగు బ్రహ్మమును తెలిసికొనవలయును. బ్రహ్మజ్ఞానమునకు మార్గాంతరము లేదు. జగత్తు బ్రహ్మజ్ఞానైకసాధనము. ఈకారణముచేతనే శ్రుతు లచ్చటచ్చట సృష్టిని వివరించినవి. బ్రహ్మవిషయకమగు సర్వవిధజ్ఞానము బ్రహ్మజ్ఞానమే యగును. బ్రహ్మముయొక్క జగన్మూలకారణత్వము, జీవానన్యత్వము, నామరూపాదులచే నావిష్కరణము మొదలగుసర్వవిధజ్ఞానము బ్రహ్మజ్ఞానశబ్దముచే నవగతమగుచున్నది. బ్రహ్మవిషయకసంపూర్ణజ్ఞానమే బ్రహ్మజ్ఞానము. బ్రహ్మమును బోధించునది ప్రతిది బ్రహ్మజ్ఞానసాధన మగుచున్నది. సువర్ణ మయములగు కటకహారాదుల జూచినప్పుడు, వాని యందు విశిష్టములగు నామ రూపముల

జగత్తు బ్రహ్మ జ్ఞాన సాధనము

జ్ఞానము, వానికి నుపాదాన కారణ మగు సువర్ణజ్ఞానము గూడ గలుగుచున్నది. విశిష్టము లగు నామరూపము లనృతము లని తోసిపుచ్చినప్పు డన్నింటికిని సామాన్యకారణమై మిగిలియున్న సువర్ణజ్ఞానము స్థిరముగ మనస్సునందు లగ్నమగుచున్నది. ఇట్లు కార్యజ్ఞానముచే కారణజ్ఞానము గల్గుచున్నది. సువర్ణాభరణమును జూచినపుడు ఆభరణము యొక్క నామరూపజ్ఞానము, సువర్ణజ్ఞానము గూడ గలిగినట్లు జగత్తును జూచినపు డద్దాని నామరూపజ్ఞానము గలిగినను కారణజ్ఞానము కలుగుటలేదు. జగత్తుయొక్క కారణజ్ఞానమే కలుగనపు డట్టి కారణస్వరూపమును నిరూపించుటెట్లు సాధ్యము? ఈ సందేహము ననన్యశరణ్యమగు శ్రుతిమాత నివారించుచున్నది. 'సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్, ఏకమేవాద్వితీయమ్' – తదైక్షత బహుస్యాం ప్రజాయేయేతి' యను ఛాందోగ్యశ్రుతివాక్యమువలన బ్రహ్మము సృష్టికి బూర్వమనభివ్యక్తనామరూప మగు నొక సద్వస్తువుగా నుండెననియు, అట్టి బ్రహ్మము నామరూపముల నభివ్యక్తమై జీవరూపమున వానియందుండె ననియు దెలియుచున్నది. "అనేన జీవేనానుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి" అని వినవచ్చు శ్రుతివాక్య మీ యర్థమును బలపఱచుచున్నది. ఇందు వలన జగత్తుయొక్క స్వరూపము నామరూపాత్మక మనియు, దాని యుపాదానకారణము బ్రహ్మ మనియు విశదమగుచున్నది. బాహ్యమునకు తెలియవచ్చుచున్న నామరూపము

లనిత్యములనుట సర్వమతసమ్మతము. కనుక సువర్ణాభరణ నామరూపములవలె జగత్తుయొక్క నామరూపములు మిథ్యామాత్రములుగ ద్రోసిపుచ్చినపు డాభరణకారణ మగు సువర్ణమువలె జగత్కారణ మగు బ్రహ్మము బుద్ధియందు లగ్నమగుచున్నది. బాహ్యప్రపంచ మేప్రకారము త్రోసి వేయదగునో యా ప్రకారమే ఆంతరంగికమగు నన్నమయాది కోశప్రప చకప్రపంచము గూడ నామరూపాత్మకమగుటచే ననిత్యమని త్రోసివేయదగును. ఇంత యేల! బుద్ధికి గోచరమగు సమస్తవస్తుసముదాయముగూడ నామరూపాత్మకమే యగుచున్నది. కనుక బుద్ధికి గోచరమగు ప్రతినామరూపమును "ఇది కా దిది కా" దని బుద్ధినుండి త్రోసిపుచ్చగా మిగిలియుండునది యేది కలదో అదియే బ్రహ్మ మని తెలిసికొనదగును. కార్యాత్మకమగు నామరూపముల ద్రోసిపుచ్చ, కారణాత్మకమగు బ్రహ్మము మిగిలియుండును. ఈ విధముగ జగత్తను పేర వ్యవహరింపబడు సమస్తవస్తుజాలము బ్రహ్మజ్ఞానసాధనమగుచున్నది. విచారచతురమతు లగు వారలకు 'సర్వం ఖల్విదం బ్రహ్మ' యను శ్రుతిచే ప్రతిపాదితమగు భోక్తృభోగ్యభోగవిస్తృతి మగు నీ జగత్తంతయు నామరూపవివర్జిత మైనపుడు బ్రహ్మాత్మకమే యగుచున్నది. ఇదియ యేకవిజ్ఞాన కార్యవిజ్ఞాన శ్రుతి హృదయము.

జగన్మూలకారణ మగు బ్రహ్మము భాసించునపుడు

జగత్తు బుద్ధియందు భాసింపదు. అనగా జగత్తనునది యొకటి యున్నట్టుల కాన్పింపదు. ఇట్టి స్థితియందు సర్వద్వైత మదృశ్యమగును. ఆస్థితియందు పుట్టుక, ప్రలయము, బద్ధుడు, ముముక్షువు, ముక్తుడు మొదలగు భావము లన్నియు బుద్ధినుండి తొలగిపోవును.

జగన్మిథ్యా వాక్యార్థము

ద్వైతభావ మీషన్మాత్రముగూడ బుద్ధియందు భాసింపకుండుటయే జగత్తసత్యమను నుడువున కర్థము. ఏ వస్తువు బుద్ధియందు భాసింపదో అది లేనట్టుల భావించెదము. జగద్భావము గూడ నొక భావనావిశేషము. అది వ్యక్తిగతమగు నొక యనుభవ విశేషము. జగత్సత్యమగుట కద్దాని నాశ మవసరము లేదు. జగత్తసత్యమనుమాటకు జగత్తు లేదని తాత్పర్యము కాదు. అది బుద్ధియందు భాసింపకుండుటయె దాని యసత్యత్వము. "ఇది కాదిది కా"దని బుద్ధిగోచరములగు వస్తువులను బుద్ధినుండి తొలగించుచున్నాము. కాని దాని నంత మొందించుట లేదు. అద్వితీయబ్రహ్మభావైకభావితమగు స్థాయియందు భావాంతరములకు తావు లేదు. వైరైకభావసమున్ముక్తమగు కంసుని భావప్రపంచమున కృష్ణునకు దక్క తక్కిన ప్రపంచమెంతమాత్రము లేదు. గాఢాలింగితు లగు కాముకుల మనమున బాహ్యాభ్యంతర ప్రపంచ మిసుమంతయు లేదు. ఇదియే 'తద్భావభావితః' అను భగవద్వాక్యార్థసూత్రము. 'అనన్యాశ్చింతయంతో మా'మను వాక్యముగూడ నీయర్థమునే ప్రతిపాదించుచున్నది. ద్వైతమంతయు లౌకికము. లోకమున కతీతుడగు జీవన్ముక్తుని దృష్టియందు ద్వైతమంతయు

సత్యంబౌ భావమే యగును. ఇదియే యౌపనిషద మగు పర మార్థము. ఇదియే 'అహం బ్రహ్మాస్మి' త్యాది మహావాక్య ములచే బ్రతిపాదింపబడిన మహోపదేశము. ఇదియే సర్వా ధ్యాత్మికశాస్త్రములకు ప్రతిష్ఠాభూత మగు సందేశము. ఈ సందేశమునే బాదరాయణుడు తన సూత్రజాలమున ముముక్షు లోకమున కందజేసెను. ఇట్టి యద్వైతతత్త్వ వైభవమునే భగవత్పాదు లమూల్య మగు తమ భాష్యమునందు సింహగర్జ నము సేసిరి. అనుభవైకవేద్యమగు నిట్టి బ్రహ్మసాక్షాత్కారము బహుజన్మాభ్యస్త సాధనాఫలము. అట్టి యభ్యాసము వెంటనే ఫలప్రదము కాకపోయినను "నహి కల్యాణకృత్కశ్చిద్దుర్గతిం తాత గచ్ఛతి" "బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్మాం ప్రపద్యతే" ఈ మొదలగు మోక్షమార్గప్రవృత్తిబోధకము లగు భగవద్వాక్యముల యందు సంపూర్ణవిశ్వాసము గలిగి బ్రహ్మవిద్యయందు బ్రవర్తించువానికి చరితార్థత కొంగుబంగ రగుననుటకు సందియమిసుమంతయు లేదు. వామదేవ జడభర తాదు లిందుకు తార్కాణములు.

అధ్యాస మౌపనిషదము

శ్రీ శంకరభగవత్పాదు లద్వైతసిద్ధాంతసౌధమునకు ప్రతిష్ఠాభూతమగు నధ్యాసతత్త్వమును తమ 'భాష్యారంభ మున సుస్థముం జేసిరి. అధ్యాస మంతయు భాష్యకారుల స్వకపోల కల్పిత మనియు, నద్దానికి బాదరాయణసూత్రముల యందుగాని, యుపని షత్తులయందుగాని యాధారము కానరాదనియు విమర్శకు

లలో కొంతమంది తాత్పర్యము. ఇది సరికాదు. అధ్యాసము బ్రహ్మసూత్రసూచితమైన టీకగ్రన్థావతారికలో వివరింపబడినది. అయ్యది యుపనిషదముగూడ నగుచున్నది. అది యెట్లన "నిష్కలం నిష్క్రియం శాంతం నిరవద్యం నిరంజనం" "ఏకమేవాద్వితీయం" "ద్వితీయాద్వై భయం భవతి"- ఈ మొదలగు శ్రుతిశతమొకప్రక్కన బ్రహ్మ మద్వితీయము, అశేషగుణ నిర్విశేషము, నిర్వికార మనియు నన్వయవ్యతిరేకముల కంఠోక్తిగ జాటుచున్నది మఱియొక ప్రక్కన "తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశః సంభూతః" మొదలగు వాక్యము లాకాశాది పురుషాన్తమగు జగత్సృష్టికిబ్రహ్మము మూలకారణ మని ముక్తకంఠముగ బల్కుచున్నవి "సోఽకామయత, బహుస్యాం ప్రజాయేయ. స తపోఽ తప్యత, స తపస్తప్త్వా ఇదగ్ంసర్వమసృజత" "యదిదంకించ" "తత్సృష్ట్వా తదేవాను ప్రావిశత్" అను శ్రుతులు బ్రహ్మమునకు సిసృక్షాలోచనప్రవేశనాదిక్రియాపూర్వకమగు సృష్టి నాపాదించుచున్నవి. బ్రహ్మము సృష్టి యనబడు నామరూపముల నభివ్యక్తమయ్యె నని శ్రుత్యంతరము పల్కుచున్నది. అభివ్యక్తములగు నామరూపము లభివ్యంజకముకంటె భిన్నములా? అభిన్నములా? యనునాశంక కలుగుచున్నది. "సదేవసోమ్యేదమగ్ర ఆసీత్" అను శ్రుతి యీ శంకను వారించుచున్నది. బహు స్యాం ప్రజాయేయ" యను వాక్యశేషమీ యర్థమును స్పష్టము చేయుచున్నది. 'స్యాం' అను ఉత్తమపురుషైకవచనబలముచే బ్రహ్మమే బహు రూపముల విస్తరించి జగజ్జీవ [illegible]

ముగ భాసించుచున్నట్లు అవగత మగుచున్నది. బ్రహ్మము నిర్వికారము. జగజ్జీవరూపమున భాసించుచున్నది. ఇది యెటుల సంభవము ? జగజ్జీవభావములు బ్రహ్మము యొక్క వికార స్వరూపము లనుట 'సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ' యను శ్రుతికి విరుద్ధము. నిరవయవ మగు బ్రహ్మమునుండి జగజ్జీవసృష్టి యారంభమైన దనుట అద్వితీయశ్రుతి వ్యాకోపక మగును. పరస్పర విరుద్ధములుగ గాన్పించు నీ శ్రుతుల కర్థసమన్వయ మేరీతిని జేయదగును ?

నిర్గుణశ్రుతులకుసృష్టి. శ్రుతులకు సమన్వయము

బ్రహ్మమునం దేమార్పు లేకున్నను, రజ్జుసర్పము, శుక్తిరజతమువలె నయ్యది జగజ్జీవులను విశేషాకారమున వర్తించుచున్నటులచూపరులకుకాన్పించుచున్నదనినయుక్తియుక్తము, సర్వశ్రుతిసమ్మతము గూడ నగుచున్నది. 'ధ్యాయతీవ, లేలాయతీవ' యనుశ్రుతి యీ వాదమున కుపకారక మగుచున్నది. కామయితృత్వము సర్జనప్రవేశాగిక్రియలు గూడ శుక్తియందు రజతమువలె బ్రహ్మమునం దారోపితము లనియు, జగజ్జీవు లద్దాని యాభాసరూపము లనియు పైశ్రుతితాత్పర్యము. ఇట్టి యధ్యాస మెటుల సంభవము ?

"మాయాం తు ప్రకృతిం విద్యాన్మాయినంతు మహేశ్వరం, తస్యావయవ భూతైస్తు వ్యాప్తం సర్వమిదం జగత్" ను శ్రుతివలన ప్రకృతి మాయారూపమైన భాసించుచున్నదనియు, నా మాయ మహేశ్వరునంటి యేకదేశమున సమస్త జగత్తును వ్యాపించి యున్నదనియు దెలియు

మాయావిద్యలు శ్రుతిప్రతిపాదితములు

చున్నది. ప్రకృతి సత్వరజస్తమోగుణాత్మకము. శుద్ధసత్వగుణప్రధానమగు ప్రకృతి మాయ యనియు, నవిశుద్ధసత్వప్రధాన మనగా గుణత్రయ మిశ్రితమగు ప్రకృతి యవిద్య యనియు చెప్పబడుచున్నది. "పరాస్య శక్తిర్వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞానబలక్రియాచ" యనుశ్రుతి మాయ పరమేశ్వరుని స్వభావసిద్ధమగు శక్తియనియు, నయ్యది బహురూపిణి యనియు బల్కుచున్నది. ఇట్లు శ్రుతిసిద్ధమగు మాయాశక్తి యాకాశాద్యుత్పత్తిశ్రిపణముచే నూహింపదగియున్నది. శ్రుతి యుక్తి సిద్ధ మగు మాయనంగీకరింపక సృష్టిసమస్యకు సమాధాన మన్యత్ర కానరాదు. శుద్ధసత్వ ప్రధానమగు మాయయందు బ్రతిఫలించిన బ్రహ్మప్రతిబింబ మీశ్వరుడనియు, నవిశుద్ధసత్వప్రధాన మగు నవిద్యయందు బ్రతిఫలించిన బ్రహ్మప్రతిబింబము జీవుడనియు వ్యవహరింప బడుచున్నారు. ఈశ్వరసంకల్పముచే నాకాశాది జగత్సృష్టియు, జీవసంకల్పముచే సంసారము సంభవించుచున్నవి. జీవునికి నవిద్యాఫలమగు శరీర మునికిపట్టు. ఆతడు శరీరాదులతో తాదాత్మ్యము నొందిసంసారముననుభవించు చున్నాడు.

జగజ్జీవులు బ్రహ్మమునందధ్యస్తములు

మాయావిద్యా ప్రభావముచే, సముద్రజలములు తరంగములైనట్లు బ్రహ్మము జగజ్జీవభావముల నవభాసించుచున్నది. కాని తరంగములు సాముద్రములు కానట్లె జగజ్జీవు లారూపమున బ్రహ్మములు గావు. ఈవిధముగ నీక్షణాది ప్రవేశాంతమగు సృష్టియంతయు నీశ్వర కర్తృకము, మాయోపాధికము నగుచున్నది. జాగ్ర

దాదివిమోక్షాంతమగు సంసారమంతయు జీవకల్పితము, అనాద్య విద్యోపాధికము నగుచున్నవి. జీవేశ్వరు లిద్దరు మాయాకామధేనువునకు వత్సలై ప్రపంచభ్రాంతినిమిత్తు లగుచున్నారు. 'మాయాఖ్యాయాః కామధేనో ర్వత్సౌ జీవేశ్వరావుభౌ'- (పంచ-చిత్ర-236) ఇట్టిభేదమును గమనించి అవిద్యాప్రాప్తము, ఆరోపితమాత్రము నగు తాదాత్మ్యభావమును వివేకింపలేక పోవుటచే నిష్కలము నిర్వికారము నగు బ్రహ్మమునం దీశ్వరకల్పితమగు సృష్టియు, అవిద్యానిబద్ధమగు జైవభావముగూడ నధ్యస్తము లగుచున్నవి. ఇదియ సర్వాధ్యాసతత్త్వము. మూలావిద్యాకల్పితమగు నిట్టి యధ్యాసయే సర్వాద్వైతతత్త్వనిదానము. అది శ్రుతిసమ్మతము. ఇట్టి శ్రుత్యుపహితమగు నధ్యాసమునే భాష్యకారులు తమభాష్యారంభమున సిద్ధాంతముచేయుట యుక్తమే కాక అవసరముగూడ నగుచున్నది. 'అధ్యాసము సుస్థము కానిచో శాస్త్రారంభమున కవకాశము లేదు' అను నీ పూర్వపక్షము సమాహితము కానియెడల శాస్త్రారంభమునకే మోసము.

ఇతి శివమ్.

మన్మథవైశాఖ శు ౫
26—4—55

రా. లిం. సోమయాజి.

బ్రహ్మసూత్ర

శాంకర మీమాంసాభాష్యమ్.

కల్యాణ కౌముదీ సమేతమ్.

ప్రథమాధ్యాయే - ప్రథమః పాదః.

ఉపోద్ఘాతః

కల్యాణ కౌముది

ఆన్ధ్రానువాదము

బ్రహ్మానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిమ్ ।
విశ్వాతీతం గగనసదృశం తత్త్వమస్యాదిలక్ష్యమ్ ।
ఏకం నిత్యం విమలమచలం సర్వధీసాక్షిభూతం ।
భావాతీతం త్రిగుణరహితం సద్గురుం తం నమామి ॥

నారాయణం పద్మభువం వశిష్ఠం శక్తిం చ తత్పుత్రపరాశరం చ ।
వ్యాసం శుకం గౌడపదం మహాన్తం గోవిందయోగీంద్రమథాస్య శిష్యమ్
శ్రీశంకరాచార్యమథాస్య పద్మపాదం చ హస్తామలకం చ శిష్యమ్ ।
తం త్రోటకం వార్త్తికకారమన్యానస్మద్గురూన్ సంతతమానతోఽస్మి ॥

శ్రుతిస్మృతిపురాణానామాలయం కరుణాలయమ్ ।
నమామి భగవత్పాదం శంకరం లోకశంకరమ్ ॥
శంకరం శంకరాచార్యం కేశవం బాదరాయణమ్ ।
సూత్రభాష్యకృతౌ వందే భగవన్తౌ పునః పునః ॥
నారాయణసమారంభాం విద్యాశంకరమధ్యమామ్ ।
కల్యాణానన్దపర్యన్తాం వందే గురుపరంపరామ్ ॥.

అవతారిక

★

"అష్టవర్షం బ్రాహ్మణముపనయీత, తమధ్యాపయీత" "స్వాధ్యాయోఽధ్యేతవ్యః" ఇత్యాదివాక్యములు బ్రాహ్మణునికి అష్టమవర్షమున నుపనయమును వేదాధ్యయనమును విధించుచున్నవి. వేదాధ్యయన మర్థసహితముగ జేయవలయును. వేదముల యాదిమభాగము ముఖ్యముగ కర్మను బోధించుచు జైమినిమునివిరచితమగు పూర్వమీమాంసాశాస్త్రమునకు విషయమగుచున్నది. అంతిమభాగము వేదాంతములు లేక ఉపనిషత్తులను నామముల ప్రసిద్ధిజెంది జీవబ్రహ్మాత్మలగూర్చి బోధించుచున్నది. ప్రతిమనుజుడును సహజముగ ఇష్టప్రాప్తిని అనిష్టపరిహారమును గోరును. సర్వానర్థనిరహితమగు పరమశ్రేయస్సు నందరు కాంక్షించెదరు. అద్దాని స్వరూపమును తత్ప్రాప్తిసాధనములు దెలిసినపుడే దానియందు ప్రవృత్తి

గలుగును. కనుకనే "బ్రహ్మవిదాప్నోతి పరం" అను తైత్తిరీయకశ్రుతి బ్రహ్మము పరమనిఃశ్రేయస్స్వరూపమనియు బ్రహ్మజ్ఞానము తత్ప్రాప్తిసాధనమనియు మున్ముందుపదేశించినది. బ్రహ్మము పరోక్షము; సులభముగ తెలియరానిది. ఆత్మ యపరోక్షము, అహంశబ్దవాచ్యమై సర్వజనముచే అనుదిన మనుభూయమానమగుచున్నది. "తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశః సంభూతః" యను వాక్యము ఆత్మబ్రహ్మముల కభేదమును సిద్ధముచేయుచున్నది. ఇట్లు పరమనిఃశ్రేయస్స్వరూపము, తత్ప్రాప్తిసాధనము తత్ఫలముగూడ తైత్తిరీయక ద్వితీయవల్లీప్రారంభమున ఉపదేశింపబడినవి. అందుచేత బ్రహ్మమును దెలిసికొనవలయునను నుత్కంఠేచ్ఛ గల్గును. తీవ్రమగు బ్రహ్మజిజ్ఞాస గలిగినమనుజుడు యథావిధి శ్రోత్రియుడు బ్రహ్మనిష్ఠుడునగు గురువుదరి జేరి యతనివలన బ్రహ్మప్రతిపాదకములగు నుపనిషత్తులను శ్రవణముంజేసి శ్రుతార్థముల మనననిదిధ్యాసములచే కృతకృత్యుడగును. సూత్రప్రాయముగ నుపదేశింపబడిన బ్రహ్మస్వరూప ప్రాప్తి సాధనముల ననుభవరూపమున వరుణుడు తనకుమారుడగు భృగువున కుపదేశించెను. సుప్రసిద్ధమగు నాబ్రహ్మము దెలిసికొనుమని 'తద్విజిజ్ఞాసస్వ' 'తద్బ్రహ్మేతి' యను వాక్యమున వరుణుడు దెలియజెప్పెను. ఈ శ్రుతివాక్యమునే విషయవాక్యముగ గ్రహించి శ్రీబాదరాయణుడు తా రచియింప బూనిన "అనావృత్తిః శబ్దాత్ అనావృత్తిః శబ్దాత్" అను

సూత్రమంతముగాగల 555 సూత్రములతో నలరారుచున్న వేదాన్త దర్శనమున "అథాతో బ్రహ్మజిజ్ఞాసా" యను ఆదిమసూత్రమును రచియించెను. బ్రహ్మజిజ్ఞాసువగు ముముక్షు జనము వేదాన్తవిజ్ఞానసునిశ్చితార్థమై కృతకృత్యతం బడయుగాకయని శ్రీవిద్యాశంకరభగవత్పాదులు సూత్రాత్మకమగు సీ వేదాంతదర్శనమునకు శారీరకమీమాంసయను నొక అమూల్యభాష్యము ననుగ్రహించిరి. ఈభాష్యము ప్రసన్న గంభీరము ప్రౌఢార్థవిలసితము నగుటంజేసి సంస్కృతభాషాజ్ఞాన ముత్సన్నకల్పమగు చున్న' నీకాలమునగూడ భాషానభిజ్ఞులయినను, విషయమును దెలిసికొనుటయం దుత్కంఠ నొంది మరుస్థలమునందలి జలాశయమువలె నచ్చటచ్చట గాన్పించు జిజ్ఞాసువుల ఉపయోగముంగోరి సరళమగు నాంధ్రభాషలో కళ్యాణకౌముదియను నీయాంధ్రవ్యాఖ్యానము రచింపబడుచున్నది.

"బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో. బ్రహ్మైవ నాపరః" యనువాక్యమున అద్వైతసిద్ధాన్తమంతయు క్రోడీకరింపబడినది. జీవబ్రహ్మైక్యపరమగు నీయర్థమునే "అయమాత్మా బ్రహ్మ" (బృ 4-4-5) యనుశ్రుతి పల్కుచున్నది. ఆత్మను దేలిసి కొనుటయే బ్రహ్మమును దెలిసికొనుట. కాని శ్రుత్యభిప్రేతమగు ఆత్మశబ్దము మతాన్తరుల కువ్యాఖ్యచే గాలుష్యమునొంది అనేక అపార్థములకు లోనగుచున్నది. దేహము, ఇంద్రియములు, మనస్సు మొదలగు అనాత్మ

స్వరూపములన్నియు ఆత్మయని దలంపబడుచున్నవి. ఆత్మా నాత్మలును వానివానిధర్మముల నొకదానియందు మఱియొకటి యారోపింపబడుచున్నవి. ఇట్లొకదానిని మఱియొకదాని యందును, నొకదానిధర్మముల మఱియొకదానియందు నారో పించుట యధ్యాసమనంబడును. ఇట్టియన్యోన్యాధ్యాసము సర్వ వేదాన్తసంసిద్ధమగు నద్వైతసిద్ధాన్తమునకు శ్రుతిస్మృత్యను భవసిద్ధమగు నిదానము. అధ్యాసమనునది భాష్యకారుల స్వక పోలకల్పితము గాదు. సూత్రకారులచేఁ నే తమశాస్త్రమున కంతకు నాధారభూతమగు "అథాతో బ్రహ్మజిజ్ఞాసా" యను .ఆదిమసూత్రమున అధ్యాసవిషయము సూచింపబడినది. బ్రహ్మజిజ్ఞాసా యను పదముచే బ్రహ్మవిషయమగు సర్వవిధ జిజ్ఞాస అవగతమగుచున్నది. బ్రహ్మానన్యమగు ఆత్మ, బ్రహ్మము నం దధ్యస్తమగు జగజ్జీవభావముగూడ బ్రహ్మజిజ్ఞాసాంతర్భా గము లగుచున్నవి. ఈ భావము "జన్మాద్యస్యయతః" అను ద్వితీయసూత్రమున మఱింత స్పష్టము చేయబడినది. అధ్యాస నిమిత్తమగు జగజ్జీవాది ద్వైతభావమె "యతో వాఇమాని భూతాని జాయన్తే" (తై 3-1) అను తైత్తిరీయక వాక్యము నందును, దాని నాధారముగ జేసికొని రచియింపబడిన జన్మాది సూత్రమునందును వినవచ్చుచున్నది. ద్వైతభావమంతయు నవిద్యామూలకమగు అధ్యాసచే నంప్రాప్తమగుచున్నదియని అద్వైతసిద్ధాన్తము. అధ్యాసము సుస్థము కానిది దానిమీద నిర్మింపబడిన అద్వైతసిద్ధాంతసౌధము సుప్రతిష్ఠితము కాదని

తలంచి శ్రీశంకరభగవత్పాదులు మున్ముందు తమ అధ్యాస భాష్యమును రచియించిరి. అయ్యది ఆక్షేపము, సమాధానము లక్షణము, సంభావన, సద్భావము, విషయప్రయోజననిరూపణము, ప్రతిజ్ఞ యని ఏడుభాగముల నలరారుచున్నది. అందు ౧లో యుష్మదస్మత్ప్రత్యయగోచరయోః అను పదములచే నాక్షేపగ్రంథము ప్రవేశపెట్టబడుచున్నది.

అనువాదము

★

'విషయము' 'విషయి' అనునవి యుష్మదస్మత్ప్రత్యయ గోచరములు. అవి తమః ప్రకాశములవలె నత్యంత ఆక్షేపము విరుద్ధస్వభావములు గలిగియున్నవి. అందువలన నా రెండింటికిని వాని ధర్మములకుగూడ నెంతమాత్రము నితరేతరభావము గలుగ నేరదు. విషయియును చిత్స్వరూపము నగు నస్మత్ప్రత్యయగోచరమునందు విషయమగు యుష్మత్ప్రత్యయగోచరమునకును నద్దానిధర్మములకును, యిందుకు విపర్యయముగ విషయికిని దానిధర్మములకును విషయమునందును అధ్యాస సంభవించుట మిథ్యయని నిర్వచింపుటకు తగియున్నది.

[వేదాన్తదర్శన మారంభించుట కవకాశము లేదను ఆక్షేపణ మీవాక్యమునం దుపపాదింపబడుచున్నది. అవశ్యం

యుష్మదస్మత్ప్రత్యయగోచరయోర్విషయవిషయిణో స్తమః

కతలేనిది యేగ్రన్థము వెలువడ నర్హ్యముగాదు. ఈదర్శన మా రంభించుటకు తగుప్రసక్తి కాన్పించుటలేదని యీ ఆక్షేపము యొక్క ముఖ్యాశయము. జ్ఞానముచే తెలియతగినది యరిలేయు విషయము. దీనిని గ్రహించువాడు విషయి. ఈత డనుదినము "అహం" అను సర్వజనసాధారణమగు జ్ఞానముచే సూచింపే బడుచున్నాడు. అహంశబ్దము కర్తృత్వ భోక్తృత్వములతో గూడుకున్న జీవుని చెప్పును. హరిశ్చంద్రపాత్రను ధరించిన గోపా లుడు తనపాత్రచే సూచింపబడినట్లు విషయి జీవునిచే నుప లక్షితుడగుచున్నాడు. విషయి కేవలజ్ఞానస్వరూ పము. ఈజ్ఞానప్రకాశము సూర్యకాంతివలె సర్వ మును ప్రకాశింపజేయుచున్నది. అట్లుచేయుట దానిస్వభావము. సూర్యకాంతిప్రసారముక్రింద జరుగులోక వ్యవహారముతో ఆకాంతికి యెట్టిసంబంధములేనట్లె విషయి స్వరూపమగు జ్ఞానప్రసారముక్రింద జరుగులోకవ్యవహారముతో నద్దానికి యెట్టిసంబంధము లేదు. విషయి సాక్షియని చెప్పబడు చున్నాడు. లోకమున సాక్షియగువాడు తనసాన్నిధ్యమునందు జరుగు వ్యవహారమునందెట్టిసంబంధము లేక యద్దాని చూచుచు మాత్రముండును. సూర్యకాంతిచే ప్రకాశింపబడు లోకవ్యవ హారమునకు సూర్యుడు కర్తగానట్లె తనకాంతి ప్రసారముచే నుద్దీపితమగు లోకవ్యవహారమునకు విషయి కర్తగాడు. కనుక తత్ఫలభోక్తగూడ కాడు. విషయి సాక్షిమాత్రుడు, సర్వ

విషయి విషయ శబ్దార్థములు.